www.peoplesnews.in

పీపుల్స్ న్యూస్

హైదరాబాద్

ప్రజల గొంతుక...

దినపత్రిక

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 16 సంచిక : 173 మంగళవారం, నవంబర్ 10, 2026 , పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad



పాలమూరుకు నీళ్లివ్వని గత పాలకులు

- కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి నిప్పులు
- పాలమూరుకు నీళ్లు ఇవ్వలేదు.. పరిశ్రమలు తీసుకురాలేదు
- పదేళ్లలో రూ.8.15 లక్షల కోట్ల అప్పులు చేశారు
- తెలంగాణను దేశంలోనే నంబర్‌వన్‌గా నిలపడమే నా లక్ష్యం
- ముఖ్యమంత్రిగా ఒక్కరోజు కూడా సెలవు తీసుకోలేదు
- గత పాలకులు మారినా పాలమూరు ప్రజల తలరాతలు మారలేదు



కొడంగల్,నవంబర్ 9 : తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిపేందుకు తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా పనిచేస్తున్నానని వెల్లడించారు. మిగతా2లో...



చర్చలు, దౌత్యంతోనే యుద్ధానికి పరిష్కారం

- జెలెన్‌స్కీతో ఫోన్‌లో మాట్లాడిన ప్రధాని మోదీ
- శాంతి ప్రయత్నాలకు భారత్ సంపూర్ణ మద్దతు
- మానవతా దృక్పథానికే ప్రాధాన్యమని స్పష్టీకరణ
- ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపైనా ఇరువురు నేతల చర్చ

న్యూఢిల్లీ,నవంబర్ 9 : రష్యా– ఉక్రెయిన్ యుద్ధానికి చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే శాంతియుత పరిష్కారం కనుగొనాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీతో ప్రధాని ఫోన్‌లో మాట్లాడారు. కొనసాగుతున్న యుద్ధ పరిస్థితులు, తాజా పరిణామాలపై ఇరువురు నేతలు చర్చించారు. యుద్ధానికి శాంతియుత పరిష్కారం లభించేలా చేపట్టే అన్ని ప్రయత్నాలకు భారత్ తనవంతు సహకారం అందించేందుకు సిద్ధంగా మిగతా2లో...

వైవాహిక బంధానికి పవన్ కల్యాణ్

దంపతుల ముగింపు

- వైవాహిక బంధానికి పవన్ కల్యాణ్ అన్నా కొణిదెల ముగింపు!
- పరస్పర అంగీకారంతో విడిపోవాలని నిర్ణయం
- పిల్లల బాధ్యతలు కొనసాగిస్తాం.. వ్యక్తిగత గోప్యతను గౌరవించండి



అమరావతి,నవంబర్ 9 : ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్, ఆయన భార్య అన్నా కొణిదెల తమ వైవాహిక బంధానికి ముగింపు పలకాలని నిర్ణయించుకున్నారు. పరస్పర అవగాహన, గౌరవంతో విడిపోతున్నట్లు ఇద్దరూ సంయుక్త ప్రకటన విడుదల చేశారు.జీవితంలో ఎంతోకాలం కలిసి ప్రయాణించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నామని వారు వెల్లడించారు. భార్యాభర్తల బంధం ముగిసినప్పటికీ మంచి స్నేహితులుగా కొనసాగుతామని తెలిపారు. తమ పిల్లలకు అంకితమైన తల్లిదండ్రులుగా బాధ్యతలు నిర్వర్తిస్తామని, వారి సంతోషం, మిగతా2లో...

పట్నం నరేందర్ రెడ్డి అరెస్ట్‌ను ఖండించిన కేటీఆర్

- కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్తున్న నాయకుడిని అడ్డుకోవడం అప్రజాస్వామికమని విమర్శ



హైదరాబాద్,నవంబర్ 9 : కొడంగల్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పట్నం నరేందర్‌రెడ్డి అరెస్టును తీవ్రంగా ఖండించారు. కోస్గిలో మృతి చెందిన పార్టీ కార్యకర్త కుటుం బాన్ని పరామర్శించేందుకు, అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వెళ్తున్న నరేందర్‌రెడ్డిని పరిగి బహార్‌పేట్ చౌరస్తా వద్ద అరెస్ట్ చేయడం మిగతా2లో...

తెలంగాణలో జనగణనకు ముహూర్తం ఖరారు

- జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు జనాభా లెక్కల సేకరణ.. జనవరి 10 నుంచి స్వీయ జనగణనకు అవకాశం



హైదరాబాద్,నవంబర్ 9 : తెలంగాణ రాష్ట్రంలో జనగణన–2027 నిర్వహణకు ప్రభుత్వం తేదీలను ఖరారు చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీఓ ఎంఎస్ నంబర్ 155ను జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన జనగణన నోటిఫికేషన్‌ను రాష్ట్ర గెజిట్‌లో పునఃప్రచురిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో రెండో విడతలో భాగంగా జనాభా లెక్కల సేకరణను 2027 జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు నిర్వహించనున్నారు. అంతకుముందు ప్రజలు స్వయంగా తమ కుటుంబ వివరాలను నమోదు చేసుకునేందుకు జనవరి 10 నుంచి 24 వరకు అవకాశం కల్పించారు. ఈ స్వీయ జనగణన ప్రక్రియను ప్రత్యేక యాప్, వెబ్‌సైట్ ద్వారా పూర్తి చేసుకోవచ్చు.స్వీయ జనగణన గడువు ముగిసిన అనంతరం జనవరి 25 నుంచి జనగణన సిబ్బంది ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలను సేకరిస్తారు. జనాభా లెక్కల సేకరణ పూర్తయిన తర్వాత వివరాల మిగతా2లో...



రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఆరు నెలల జైలు శిక్ష

- కోర్టు ధిక్కరణ కేసులో హైకోర్టు తీర్పు.. అప్పీల్ కోసం నాలుగు వారాలపాటు శిక్ష అమలు నిలిపివేత

హైదరాబాద్,నవంబర్ 9 : కోర్టు ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా అమలు చేయలేదని తేల్చిన తెలంగాణ హైకోర్టు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డికి ఆరు నెలల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.2 వేల జరిమానా విధించింది. జస్టిస్ కె. లక్ష్మణ్ ఈ మేరకు కోర్టు ధిక్కరణ పిటిషన్‌పై తీర్పు మిగతా2లో...

అందరి సహకారంతోనే కరీంనగర్ అభివృద్ధి

- రాజకీయాలకు అతీతంగా పనిచేద్దాం: బండి సంజయ్, పొన్నం ప్రభాకర్



జనవరిలో ఐదు రాష్ట్రాల ఎన్నికల నగారా!

- యూపీ, పంజాబ్, గోవా, మణిపూర్, ఉత్తరాఖండ్‌లో అసెంబ్లీ ఎన్నికలు



పాలమూరుకు నీళ్లివ్వని గత పాలకులు

(మొదటి పేజీ తరువాయి)

సోమవారం కొడంగల్ నియోజకవర్గంలో నిర్వహించిన రైతన్నతో ఆత్మీయ సభలో రైతులతో మాట్లాడిన ఆయన, పాలమూరు ప్రాంత అభివృద్ధి, గత ప్రభుత్వ పాలన, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై పలు వ్యాఖ్యలు చేశారు. **ఎందరో నాయకులు పచ్చినా పాలమూరు బతుకులు మారలేదు**గతంలో ఎంతోమంది నాయకులు, మంత్రులు పాలమూరు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించినప్పటికీ ఈ ప్రాంత ప్రజల తలరాతలు మారలేదని రేవంత్‌రెడ్డి అన్నారు. పాలమూరు ప్రజలు ఎప్పటినుంచో సాగునీరు, వలసల కోసం నాయకులను అడుగుతూనే ఉన్నారని తెలిపారు. అయినా ఈ జిల్లాకు అవసరమైన నీళ్లు, వలసలు అందించలేకపోయారని విమర్శించారు. పాలమూరులో సాగునీటి సమస్యలు పరిష్కారం కాకపోవడంతో వలసలు కొనసాగాయని, రైతుల పొలాలకు నీరు అందని పరిస్థితి నెలకొందని గుర్తుచేశారు. **కేసీఆర్ పాలమూరు రుణం తీర్చుకుంటారని ఆశించాం**గతంలో పాలమూరు ప్రజలు కేసీఆర్‌ను ఎంపీగా గెలిపించి గుండెల్లో పెట్టుకున్నారని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. పాలమూరు నుంచే ఎంపీగా గెలిచిన కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ఈ ప్రాంతానికి న్యాయం చేస్తారని భావించామని చెప్పారు. పాలమూరు ప్రజల రుణం తీర్చుకుంటారని, ఈ ప్రాంతంలోని సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేసి రైతులకు నీరందిస్తారని ఆశించామని తెలిపారు. అయితే ఆ ఆశలు నెరవేరలేదని విమర్శించారు. **మా గుండెలపై తన్ని కృష్ణా నదిలో పడేశారు** కేసీఆర్ పాలమూరు ప్రజలకు కనీస కృతజ్ఞత చూపలేదని రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తమను గెలిపించి, ముఖ్యమంత్రి స్థాయికి తీసుకెళ్లిన పాలమూరు ప్రజల అభివృద్ధిని పట్టించుకోలేదని ఆరోపించారు. పాలమూరు జిల్లాపై కక్ష పెంచుకున్నారని, ఈ ప్రాంతానికి చుక్కనీరు కూడా ఇవ్వలేదని విమర్శించారు. పాలమూరు ప్రజల గుండెలపై తన్ని కృష్ణా నదిలో పడేశారని ఘాటుగా వ్యాఖ్యానించారు. **రూ.8.15 లక్షల కోట్ల అప్పుల భారం** బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రంపై రూ.8.15 లక్షల కోట్ల అప్పులు చేశారని ముఖ్యమంత్రి ఆరోపించారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పులమయం చేశారని విమర్శించారు. ఇంతటి అప్పుల భారంతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లడం తమ ప్రభుత్వానికి సవాలుగా మారిందని చెప్పారు. గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ఇబ్బందుల్లోకి నెట్టిందని ఆరోపించారు. **ఉద్యోగులకు ఒకటో తేదీనే జీతాలు ఇస్తున్నాం** తాను ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టే సమయానికి ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు చెల్లించే పరిస్థితి కూడా లేదని రేవంత్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రం ఎదుర్కొంటున్న అప్పుల సమస్యను అధిగమించేందుకు తమ ప్రభుత్వం కృషి చేసిందన్నారు. ప్రభుత్వ వ్యవస్థలను గాడిలో పెడుతూ ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ పాలనను సక్రమంగా కొనసాగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

తెలంగాణను సంబర్‌పన్‌గా తీర్చిదిద్దుతాం

తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం, రైతుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. పాలమూరు ప్రాంత ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. తెలంగాణను దేశంలోనే నంబర్‌వన్ రాష్ట్రంగా నిలబెట్టడమే తమ లక్ష్యమని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

తెలంగాణలో జనగణనకు ముహూర్తం ఖరారు

(మొదటి పేజీ తరువాయి)

పరిశీలన, సవరణల కోసం మార్చి 1 నుంచి 5 వరకు పునఃపరిశీలన ప్రక్రియ నిర్వహిస్తారు.

ఈ జనగణనకు 2027 మార్చి 1వ తేదీ అర్ధరాత్రి 12 గంటలను ప్రామాణిక తేదీగా నిర్ణయించారు.కేంద్ర హోంశాఖ పరిధిలోని రిజిస్ట్రార్ జనరల్, జనగణన కమిషనర్ కార్యాలయం జారీ చేసిన నోటిఫికేషన్‌కు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ షెడ్యూల్‌ను ప్రకటించింది.

ఉత్తర్వులను అన్ని శాఖల అధికారులు, జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు, జనగణన అధికారులకు పంపించారు.ఇప్పటికే తొలి విడతలో భాగంగా ఇళ్ల జాబితా తయారీ, గృహ గణన ప్రక్రియను మే 11 నుంచి జూన్ 9 వరకు నిర్వహించారు. ప్రస్తుతం రెండో విడత జనాభా లెక్కల సేకరణకు అవసరమైన ఏర్పాట్లు, సిబ్బంది నియామకం, శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. జనగణన ద్వారా సేకరించే వివరాలు ప్రభుత్వ పథకాల రూపకల్పన, అభివృద్ధి ప్రణాళికలు, వనరుల కేటాయింపులకు ఉపయోగపడనున్నాయి.

అందరి సహకారంతోనే కరీంనగర్ అభివృద్ధి

కరీంనగర్, నవంబర్ 9 : కరీంనగర్ అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. అభివృద్ధి పనులకు కొందరు కావాలనే అడ్డంకులు సృష్టిస్తున్నారని విమర్శించారు. డంపింగ్ యార్డు సమస్య పరిష్కారానికి అమృత్ పథకం కింద రూ.17 కోట్లు, పట్టణ సవాళ్ల నిధి కింద రూ.80 కోట్లతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు.మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఎన్నికల వరకే రాజకీయాలని, ఆ తర్వాత జిల్లా అభివృద్ధికి అందరూ కలిసి పనిచేయా లని పిలుపునిచ్చారు. పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని, విద్యా, వైద్య రంగాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అసంపూర్తిగా ఉన్న మెడికల్ కాలేజీ, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు. నగరంలోని 23, 25, 26, 46వ డివిజన్లలో రూ.4.5 కోట్లతో చేపట్టనున్న డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు బండి సంజయ్, పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేశారు. మేయర్ కొలగాని శ్రీనివాస్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కృత్రిమ మేధ ఆధారిత దాడులతో ఆర్థిక సంస్థలకు ముప్పు: సీపీ సజ్జనార్

హైదరాబాద్, నవంబర్ 9 : బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, త్వరిత వస్తు సరఫరా సంస్థలు తమ సైబర్ భద్రతను మరింత బలోపేతం చేసుకోవాలని సీపీ సజ్జనార్ సూచించారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా సైబర్ నేరగాళ్లు కొత్త పద్ధతుల్లో దాడులకు పాల్పడుతున్నారని, ముఖ్యంగా కృత్రిమ మేధ ఆధారిత దాడుల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.కృత్రిమ మేధ సాధనాలతో సంస్థల నెట్‌వర్క్‌లలోని లోపాలను గుర్తిస్తున్న నేరగాళ్లు,



చెల్లింపు వ్యవస్థలను దుర్వినియోగం చేసి ఇతరుల ఖాతాల ద్వారా నగదును మళ్లిస్తున్నారని తెలిపారు. వినియోగంలో లేని పాత సాంకేతిక అనుసంధానాలను తొలగించాలని, సాఫ్ట్‌వేర్‌ను ఎప్పటికప్పుడు నవీకరించాలని సూచించారు. అనుమానాస్పద లావాదేవీలను గుర్తించే వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలని, ఉద్యోగులకు సైబర్ భద్రతపై అవగాహన కల్పించాలని కోరారు.సైబర్ దాడులను ఎదుర్కొనేందుకు ముందస్తు పరీక్షలు నిర్వహించాలని, ఐటీ, సైబర్ భద్రతా బృందాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సైబర్ మోసానికి గురైన వారు వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని లేదా cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సజ్జనార్ తెలిపారు.

దీపావళి పాగతో క్షీణించిన గాలి నాణ్యత!

- విజయవాడలో 112 డెసిబుల్స్‌కు చేరిన శబ్ద తీవ్రత.. ఢిల్లీలో 400కు ఎక్యూఐ

అమరావతి,నవంబర్ 9 :దీపావళి సందర్భంగా బాణసంచా కాల్చడంతో ఆంధ్రప్రదేశ్‌లో వాయు, శబ్ద కాలుష్యం పెరిగింది. విశాఖపట్నం, రాజమహేంద్రవరం నగరాల్లో గాలి నాణ్యత క్షీణించింది. రాష్ట్రంలోని 15 ప్రాంతాల్లో గాలి నాణ్యత సూచీ (ఎక్యూఐ) 101 నుంచి 200 మధ్య నమోదైంది.విశాఖపట్నంలో గరిష్ఠ శబ్ద తీవ్రత 111 డెసిబుల్స్‌కు చేరగా, విజయవాడలో 112 డెసిబుల్స్ నమోదైంది. తిరుపతిలో అత్యధికంగా 191 ఎక్యూఐ నమోదైంది. నెల్లూరులో 175, శ్రీకాకుళంలో 170, ఏలూరులో 118గా నమోదయ్యాయి. అమరావతి, విజయవాడ, గుంటూరు, అనంతపురం ప్రాంతాల్లోనూ గాలి నాణ్యత ఒక్కసారిగా పడిపోయింది.దేశ రాజధాని ఢిల్లీలో ఎక్యూఐ 400కు చేరడంతో పరిస్థితి ఆందోళన కరంగా మారింది. ఉత్తరప్రదేశ్‌లోని లోనీలోనూ గాలి నాణ్యత ప్రమాదకర స్థాయికి పడిపోయింది.



పీఎం2.5, పీఎం10 ధూళి కణాల స్థాయిలు అధికంగా నమోదయ్యాయి.ఎక్యూఐ 101 నుంచి 200 మధ్య ఉంటే ఆస్తమా, ఊపిరితిత్తులు, గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారికి శ్వాసకోశ ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. కాలుష్యాన్ని పర్యవేక్షించేందుకు రాష్ట్రవ్యాప్తంగా గాలి నాణ్యత, శబ్ద తీవ్రత కొలిచే కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఏపీ కాలుష్య నియంత్రణ మండలి వెల్లడించింది. విశాఖలో కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపింది.

చర్చలు, దౌత్యంతోనే యుద్ధానికి పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)

ఉందని మోదీ పునరుద్ఘాటించారు. **మానవతా దృక్పథానికే ప్రాధాన్యం** ప్రస్తుత సంక్షోభంలో భారత్ మానవతా దృక్పథంతో వ్యవహరిస్తోందని మోదీ తెలిపారు. యుద్ధం వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని శాంతి స్థాపనకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. వివాదాన్ని పరిష్కరించుకోవడానికి చర్చలు, దౌత్యమే సరైన మార్గమని భారత్ మొదటి నుంచీ చెబుతోందని గుర్తుచేశారు. శాంతియుత పరిష్కారం కోసం జరిగే ప్రయత్నాల్లో భారత్ భాగస్వామ్యం కావడానికి సిద్ధంగా ఉందని జెలెన్‌స్కీకి తెలిపారు. **అబుధాబి సమావేశంపై జెలెన్‌స్కీ వివరణ**మోదీతో మాట్లాడిన విషయాన్ని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో వెల్లడించారు. తాజా దౌత్య పరిణామాలు, అబుధాబిలో జరగనున్న సమావేశానికి ఉక్రెయిన్ చేస్తున్న సన్నాహాల గురించి ప్రధానికి వివరించినట్లు తెలిపారు. యుద్ధాన్ని ముగించేందుకు ఉక్రెయిన్ సిద్ధంగా ఉందని, రష్యా కూడా ఉద్రిక్తతలను తగ్గించేందుకు ముందుకు రావాలని అన్నారు. ఇది యుద్ధాన్ని కొనసాగించే సమయం కాదని, ముగించాల్సిన సమయమని మోదీ పలుమార్లు స్పష్టం చేసినట్లు జెలెన్‌స్కీ గుర్తుచేశారు. **ధాన్యం రవాణాకు భారత్ సహకారం కోరిన జెలెన్‌స్కీ** నల్ల సముద్రం మీదుగా ధాన్యం ఎగుమతులకు ఆటంకాలు ఏర్పడుతున్న అంశాన్ని కూడా జెలెన్‌స్కీ ప్రస్తావించారు. ఆహార భద్రతకు విఘాతం కలగకుండా ధాన్యం రవాణా కోసం ప్రత్యేక మార్గాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మధ్యవర్తిత్వం వహించేందుకు భారత్ సిద్ధంగా ఉందని, న్యూఢిల్లీ తన ప్రయత్నాలను కొనసాగిస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. ధాన్యం ఎగుమతులకు ఆటంకాలు తొలగించడం ద్వారా ప్రపంచ ఆహార భద్రతకు తోడ్పడవచ్చని అభిప్రాయపడ్డారు. **ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై చర్చ** భారత్-ఉక్రెయిన్ మధ్య వివిధ రంగాల్లో ద్వైపాక్షిక సహకా రాన్ని మరింత బలోపేతం చేసుకునే అంశాలపై కూడా మోదీ, జెలెన్‌స్కీ చర్చించారు. ఇరు దేశాల ప్రజల పరస్పర ప్రయోజనాల కోసం సహకారాన్ని విస్తరించుకోవాలని నిర్ణయించారు. యుద్ధ పరి ష్కారం తో పాటు శాంతి స్థాపన, మానవతా అంశాలపై భారత్ తన వైఖరిని మరోసారి స్పష్టం చేసింది.

వైవాహిక బంధానికి పవన్ కల్యాణ్ దంపతుల ముగింపు

(మొదటి పేజీ తరువాయి)

సంక్షేమమే తమ ఉమ్మడి ప్రాధాన్యమని పేర్కొన్నారు.ఈ వ్యక్తిగత మార్పును అర్థం చేసుకుని, తమ గోప్యతను గౌరవించాలని ప్రజలు, అభిమానులు, శ్రేయోభిలాషులను కోరారు. ఇంతకాలం తమకు అండగా నిలిచిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. విడిపోవడానికి గల కారణాలను మాత్రం సంయుక్త ప్రకటనలో వెల్లడించలేదు. పవన్ కల్యాణ్, అన్నా 2013 సెప్టెంబర్ 30న వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

జనవరిలో ఐదు రాష్ట్రాల ఎన్నికల నగారా!

న్యూఢిల్లీ,నవంబర్ 9 :దేశంలోని ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను వచ్చే ఏడాది జనవరి మొదటి అర్ధభాగంలో ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. ఉత్తరప్రదేశ్, పంజాబ్, ఉత్తరాఖండ్, మణిపూర్, గోవా రాష్ట్రాల్లో 2027లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లను ముమ్మరం చేసింది.ఎన్నికల సన్నద్ధతను పరిశీలించేందుకు ఎన్నికల సంఘం ఉన్నతాధికారుల బృందాలు ఆయా రాష్ట్రాల్లో పర్యటిస్తున్నాయి. పంజాబ్, ఉత్తరాఖండ్, మణిపూర్‌లో పర్యటనలు పూర్త య్యాయి. ఉత్తరప్రదేశ్‌లో ఒక పర్యటన పూర్తికాగా, మరో రెండు పర్యటనలు నిర్వహించాల్సి ఉంది. గోవాలో పర్యటన ఇంకా జరగాల్సి ఉంది. ఈ నెలాఖరులోగా అధికారుల పర్యటనలు పూర్తయ్యే అవకా శం ఉంది.ఆ తర్వాత ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇద్దరు ఎన్నికల కమిషనర్లు ఐదు రాష్ట్రాల్లో పర్యటించి ప్రభుత్వ ఉన్నతాధికారులు, పోలీసు అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశ మవుతారు. శాంతిభద్రతలు, పోలింగ్ కేంద్రాలు, ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను సమీక్షిస్తారు. ఉత్తరప్రదేశ్‌లో అధిక నియోజకవర్గాలు ఉండటంతో పలు విడతల్లో పోలింగ్ నిర్వహించే అవకాశం ఉంది. పంజాబ్, గోవా, ఉత్తరాఖండ్‌లో ఒకే విడతలో ఎన్నికలు జరిగే అవకాశమున్నట్లు సమాచారం. అయితే ఎన్నికల తేదీలు, పోలింగ్ విడతలపై ఎన్నికల సంఘం ఇంకా అధికారిక ప్రకటన చేయలేదు.

రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఆరు నెలల జైలు శిక్ష

(మొదటి పేజీ తరువాయి)

వెలువరించారు. అయితే తీర్పుపై అప్పీల్ చేసుకునేందుకు వీలుగా శిక్ష అమలును నాలుగు వారాలపాటు నిలిపివేశారు.**నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించాలని వినతి** రిజిస్ట్రేషన్ చట్టం 1908లోని సెక్షన్ 22-ఏ ప్రకారం నిషేధిత ఆస్తుల జాబితాలో ఉన్న తమ భూములను తొలగించాలని కొందరు బాధితులు అధికారులను కోరారు. ఈ వినతిని పరిశీలించి 60 రోజుల్లో నిర్ణయం తీసుకోవాలని 2025 ఆగస్టులో హైకోర్టు కలెక్టర్‌ను ఆదేశించింది. అయినప్పటికీ నిర్ణీత గడువులో చర్యలు తీసుకోకపోవడంతో బాధితులు 2025 అక్టోబర్ 15న కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు.**అధికారుల వివరణపై న్యాయస్థానం అభ్యంతరం** కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైన తర్వాతే అధికారులు బాధితులకు నోటీసులు జారీ చేసి, 2026 ఫిబ్రవరి 26న వారి వినతిని తిరస్కరించారు. అనంతరం జూలై 8న మరోసారి తిరస్కరణ ఉత్తర్వులు జారీ చేశారు. విచారణ సందర్భంగా కలెక్టర్ సమర్పించిన వివరణలోని అంశాలు, అధికారిక రికార్డుల్లోని వివరాల మధ్య వ్యత్యాసాలను న్యాయస్థానం గుర్తించింది. ఆర్డీఓ, తహసీల్దార్ తదితరుల విచారణకు సంబంధించిన పత్రాల్లో సంతకాలు లేకపోవడాన్ని కూడా ప్రస్తావించింది.కోర్టు ఆదేశాలను తెలిసి కూడా అమలు చేయడంలో ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం వహించారని పేర్కొంటూ కలెక్టర్‌కు ఆరు నెలల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధించింది. ఉన్నత న్యాయస్థానంలో అప్పీల్ చేసుకునేందుకు నాలుగు వారాలపాటు శిక్ష అమలును నిలిపివేసింది.

పట్నం నరేందర్ రెడ్డి అరెస్టును ఖండించిన కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)



కాంగ్రెస్ ప్రభుత్వ అప్రజాస్వామిక, నిరంకుశ వైఖరికి నిదర్శనమని కేటీఆర్ మండిపడ్డారు. కష్టాల్లో ఉన్న కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్తున్న నాయకుడిని అరెస్ట్ చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. బాధిత కుటుంబానికి అండగా నిలవడం కూడా ఇందిరమ్మ రాజ్యంలో నేరమైందా అని నిలదీశారు.ప్రజా పాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ, ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కుతోందని కేటీఆర్ అన్నారు. అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో ప్రతిపక్షాలను భయభ్రాంతులకు గురిచేయడమే పాలనగా మార్చుకుందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఇలాంటి కక్షసాధింపు చర్యలకు బీఆర్ఎస్ ఏమాత్రం భయపడదని స్పష్టం చేశారు. ప్రజల పక్షాన, కార్యకర్తల పక్షాన తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. పట్నం నరేందర్‌రెడ్డిని వెంటనే, ఎలాంటి షరతులు లేకుండా విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

నిర్మాణదారుడి కనుసైగే శాసనమా? సర్కిల్

--57లో అధికారుల అధికారం బంది!

- బిల్డర్ రాజ్యం.. అధికారుల బానిసత్వం! ఉషోదయ కాలనీలో నిబంధనలకు సమాధి?
- అక్రమ నిర్మాణానికి అండ ఎవరు? సర్కిల్--57 అధికారుల మౌనం వెనుక మర్మమేమిటి?
- బిల్డర్ ముందు టౌన్‌ప్లానింగ్ శాఖ మోకరిల్లిందా?
- రెసిడెన్షియల్ ముసుగులో కమర్షియల్ దందా.. అధికారుల కళ్లు మూసుకున్నాయా?
- ప్లాట్లు 75, 76లో నిర్మాణాల దూకుడు.. అధికారుల చర్యలు మాత్రం శూన్యం!
- చట్టం సామాన్యుడికేనా? బిల్డర్‌కు సర్కిల్--57లో ప్రత్యేక రాజ్యాంగమా?
- నిర్మాణదారుడి ఇష్టమే చట్టమా? అధికారుల విధులు గాలిలో కలిసాయా?
- అక్రమాలకు రక్షణ కవచం అధికారుల మౌనమేనా? ఉషోదయ కాలనీలో అంతులేని ప్రశ్నలు!
- బిల్డర్ ఆదేశాలు.. అధికారుల అమలు? సర్కిల్--57లో ప్రజాస్వామ్యానికి సవాల్!





కుత్బుల్లాపూర్, నవంబర్ 9 (పీపుల్స్ న్యూస్)

ప్రభుత్వ నిబంధనలు సామాన్యులకే పరిమితమా? బడా నిర్మాణదారులకు మాత్రం ప్రత్యేక చట్టాలు అమలవుతున్నాయా? నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయాల్సిన అధికారులు.. ఉల్లంఘనలను అడ్డుకోవాల్సిన టౌన్‌ప్లానింగ్ యంత్రాంగం.. చివరకు నిర్మాణదారుడి కనుసైగలకు తలొగ్గుతున్నాయా? గాజులరామారం సర్కిల్--57 పరిధిలోని ఉషోదయ కాలనీలో జరుగుతున్న నిర్మాణాలపై వ్యక్తమవుతున్న అభ్యంతరాలు ఇప్పుడు ఈ ప్రశ్నలకు తావిస్తున్నాయి. చిత్తారమ్మ ఆలయం సమీపంలో, ట్రెండ్స్ ఎదురుగా ఉన్న ప్లాట్లు 75, 76 వద్ద నిర్మాణాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నా సంబంధిత అధికారుల నుంచి స్పష్టమైన స్పందన కనిపించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రెసిడెన్షియల్ అనుమతుల ముసుగులో వాణిజ్య నిర్మాణాలు చేపడుతున్నారన్న ఆరోపణలపై వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

నిర్మాణదారుడి కనుసైగే శాసనమా?

నిర్మాణదారుడి ఇష్టమే చట్టమైతే.. ప్రభుత్వ నిబంధనలకు విలువ ఏమిటి? అనుమతులు మంజూరు చేసే అధికారం అధికారులదే. వాటిని అమలు చేయాల్సిన బాధ్యత కూడా వారిదే. మరి నిర్మాణదారుడి ఇష్టానుసారంగా పనులు సాగుతున్నాయన్న ఆరోపణలు వస్తున్నా ఎందుకు స్పందించడం లేదు? ఆమోదిత ప్రణాళికలో నివాస భవనంగా చూపించి క్షేత్రస్థాయిలో వాణిజ్య సముదాయంగా నిర్మిస్తున్నారా? అనుమతించిన అంతస్తులు, నిర్మాణ విస్తీర్ణం, సెట్‌బ్యాక్‌లను ఉల్లంఘిస్తున్నారా? ఈ ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సిన అధికారులు మౌనంగా ఉండటం అనేక సందేహాలకు కారణమవుతోంది. నిర్మాణదారుడి ముందు అధికారుల అధికారాలు ఆవిరైపోయాయా? లేక తెరవెనుక ఏదైనా వ్యవహారం నడుస్తోందా? అన్న అనుమానాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు.

రెసిడెన్షియల్ అనుమతులు.. కమర్షియల్ నిర్మాణాలా?

నివాస భవనానికి అనుమతులు తీసుకుని వాణిజ్య అవసరాలకు వినియోగించే నిర్మాణాలు చేపడుతున్నారన్న ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. అనుమతుల పత్రాల్లో ఒకటి.. క్షేత్రస్థాయిలో మరొకటి ఉంటే దాన్ని గుర్తించాల్సిన బాధ్యత టౌన్‌ప్లానింగ్ శాఖదే కాదా? భవన నిర్మాణ అనుమతులు ఏ ప్రయోజనం కోసం మంజూరయ్యాయి? ఆమోదిత ప్లాన్‌లో పేర్కొన్న నిర్మాణ స్వరూపం ఏమిటి? వాస్తవంగా జరుగుతున్న పనులు వాటికి అనుగుణంగా ఉన్నాయా? అధికారులు ఈ వివరాలను ప్రజల ముందుంచాలి. నివాస భవనం పేరుతో వాణిజ్య సముదాయం నిర్మిస్తుంటే అది నిబంధనల ఉల్లంఘన కాదా? అనుమతుల ముసుగులో నిర్మాణదారుడికి స్వేచ్ఛనిచ్చినట్లయితే బాధ్యత ఎవరిది?

సెల్లార్ బాగోతం.. పార్కింగ్ పేరుతో మరో దందానా?

ప్లాట్లు 75, 76 వద్ద జరుగుతున్న సెల్లార్ నిర్మాణంపై కూడా స్పష్టత అవసరమవుతోంది. సెల్లార్‌కు అనుమతులు ఉన్నాయా? పార్కింగ్ కోసమే నిర్మిస్తున్నారా? లేక వాణిజ్య అవసరాలకు వినియోగించేందుకు సిద్ధమవుతున్నారా? భవన నిర్మాణ అనుమతులు, పార్కింగ్ ఏర్పాట్లు, సెట్‌బ్యాక్‌లు, అగ్నిమాపక భద్రతా నిబంధనలపై అధికారులు సమగ్రంగా పరిశీలించాల్సి. నిర్మాణం పూర్తయ్యాక ఉల్లంఘనలు గుర్తించి చర్యలు తీసుకోవడం కంటే.. ఇప్పుడే క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి వాస్తవాలను బయటపెట్టడం ముఖ్యం. నిర్మాణం జరుగుతున్న సమయంలోనే అడ్డుకునే అధికారం లేదా? లేక నిర్మాణదారుడి వేగానికి అధికారుల చర్యలు కూడా వేగం అందుకోలేకపోతున్నాయా?

సామాన్యుడికి నిబంధనలు.. బడా బిల్డర్‌కు మినహాయింపులా?

సామాన్యుడు చిన్న నిర్మాణం చేపట్టినా నిబంధనల పేరుతో నోటీసులు, హెచ్చరికలు జారీ చేసే అధికారులు.. పెద్ద నిర్మాణాల విషయంలో మాత్రం ఎందుకు మౌనంగా ఉంటున్నారు? ఒకే శాఖకు రెండు రకాల న్యాయాలా? ప్రజల ఇళ్లపై నిబంధనల కొరడా ఝళిపించే యంత్రాంగం.. బడా నిర్మాణదారుడి విషయంలో ఎందుకు వెనుకడుగు వేస్తోంది? క్షేత్రస్థాయి సిబ్బంది తనిఖీలు నిర్వహించారా? ఉల్లంఘనలు గుర్తించారా? నివేదికలు ఉన్నతాధికారులకు సమర్పించారా? సమర్పిస్తే చర్యలు ఎందుకు కనిపించడం లేదు? నివేదికలు లేకపోతే తనిఖీలు నిర్వహించని సిబ్బందిపై చర్యలు తీసుకుంటారా? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత సర్కిల్--57 టౌన్‌ప్లానింగ్ అధికారులదే.

ముడుపుల ఆరోపణల నీడలో టౌన్‌ప్లానింగ్ శాఖ!

నిర్మాణ వ్యవహారంలో అధికారుల సహకారం, ముడుపులపై స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలు నిజమా కాదా అన్నది సమగ్ర విచారణలో తేలాల్సి ఉంది. అయితే ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నప్పుడు వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై లేదా? నిర్మాణదారుడికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలపై ఉన్నతాధికారులు విచారణకు సిద్ధమా? నిర్మాణ అనుమతుల ఫైళ్లు, తనిఖీ నివేదికలు, జారీ చేసిన నోటీసులు, తీసుకున్న చర్యలను పరిశీలిస్తే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ముడుపుల ఆరోపణలపై స్వతంత్ర విచారణ జరిపి బాధ్యులెవరో తేల్చాలి. ఉద్యోగ ధర్మం కంటే వ్యక్తిగత ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తున్నారన్న అనుమానాలకు అధికారులు సమాధానం చెప్పాల్సిందే.

సర్కిల్--57లో బిల్డర్ రాజ్యమా?

నిబంధనలను ఉల్లంఘించినట్లు తేలితే నిర్మాణదారుడిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. విధుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులపైనా శాఖాపరమైన విచారణ జరగాలి. కానీ నిర్మాణంపై ప్రశ్నలు తలెత్తుతున్నా అధికారుల నుంచి స్పష్టమైన సమాధానం రాకపోవడం అనేక సందేహాలకు తావిస్తోంది. టౌన్‌ప్లానింగ్ శాఖ ప్రజలకు జవాబుదారీగా పనిచేస్తోందా? లేక నిర్మాణదారుడి ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తోందా? సర్కిల్--57లో అధికారుల ఆదేశాలు అమలవుతున్నాయా? లేక నిర్మాణదారుడి నిర్ణయాలే చెల్లుబాటు అవుతున్నాయా? అన్న ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి.

ఉన్నతాధికారులారా.. ఇప్పటికైనా మేల్కొనండి!

ఉషోదయ కాలనీ ప్లాట్లు 75, 76 వద్ద జరుగుతున్న నిర్మాణాలపై తక్షణమే సమగ్ర విచారణ చేపట్టాలి. మంజూరైన అనుమతులు, ఆమోదిత ప్రణాళికలు, క్షేత్రస్థాయి నిర్మాణాలను పోల్చి పరిశీలించాలి. సెల్లార్, పార్కింగ్, వాణిజ్య వినియోగం, సెట్‌బ్యాక్‌లపై వాస్తవాలను వెల్లడించాలి. అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నట్లు నిర్ధారణ అయితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. ముడుపుల ఆరోపణలపైనా స్వతంత్ర విచారణ జరిపి బాధ్యులెవరో తేల్చాలి. విధుల్లో నిర్లక్ష్యం వహించిన సిబ్బందిని కూడా బాధ్యులుగా పరిగణించాలి.నిర్మాణదారుడి కనుసైగే అధికారులకు ఆదేశమా? నిబంధనలను అమలు చేయాల్సిన శాఖే మౌనంగా ఉంటే అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేసేదెవరు? సర్కిల్--57లో జరుగుతున్న వ్యవహారాలపై ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందిస్తారా? లేక నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రేక్షకపాత్రకే పరిమితమవుతారా? ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత సంబంధిత అధికారులదే. బిల్డర్ రాజ్యానికి తెరపడుతుందా? అధికారుల మౌనం వీడుతుందా? లేక ఉషోదయ కాలనీలో నిబంధనల ఉల్లంఘనలపై ప్రశ్నలు ప్రశ్నలుగానే మిగిలిపోతాయా?

అసైన్డ్ భూముల కబ్జా.. దొంగ పట్టాలతో లబ్ధి..!

- జవహర్ నగర్ శివారులో 368, 341, 441 సర్వే నంబర్లలో 50 ఎకరాల కబ్జా
- బినామీ పేర్లతో పట్టాలు, రైతుబంధు, బ్యాంకు లోన్లు
- చర్యలు చేపట్టాలని గ్రీవెన్స్ లో వినతి పత్రం అందజేసిన భేతి సతీష్



వెంకటాపూర్ రామప్ప నవంబర్ 08(పీపుల్స్ న్యూస్)

వెంకటాపూర్ మండలం జవహర్ నగర్ గ్రామ శివారులో గల 368, 341, 441 సర్వే నంబర్లలోని అసైన్డ్ భూమిని ములుగు మండలం జంగాలపల్లికి చెందిన ఓ వ్యక్తి గత కొన్నేళ్ల క్రితం సుమారు 50 ఎకరాల వరకు కబ్జా చేసి దొంగ పట్టాలు పొందాడని వెంకటాపూర్ మండలం ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన బేతి సతీష్ యాదవ్ ఆరోపించాడు.ఈ మేరకు ఆయన సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ లో ఆయన వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సతీష్ యాదవ్ మాట్లాడారు. అసైన్డ్ భూముల కబ్జా వ్యవహారంపై అప్పట్లో పలు వార్తా కథనాలు రావడంతో అప్పటి ఉమ్మడి వరంగల్ జిల్లా జాయింట్ కలెక్టర్ వాకాటి కరుణ స్పందించి, జవహర్ నగర్ భూములపై పరిశీలన చేపట్టినట్లు తెలిపారు . ఆ విచారణలో అసలు విషయం వెలుగులోకి రావటం తో సదరు వ్యక్తి ఆక్రమించిన భూమి లో నుండి అతని పేరు మీద ఉన్న కొంత భూమిని అప్పట్లోనే అధికారులు స్వాధీనం చేసుకున్నారని ఆయన పేర్కొన్నారు.అయినప్పటికీ మిగతా 45 ఎకరాల భూమిని అతగాడు తన కుటుంబ సభ్యులు, బంధువుల పేరు మీద దొంగ పట్టాలు పొంది ఉన్నాడని ఆయన ఆరోపించారు .అట్టి భూమిపై రైతుబంధు తీసుకోవడంతో పాటు, బ్యాంకుల్లో పాస్ బుక్స్ తాకట్టు పెట్టి లోన్ సైతం పొందినట్లు ఆయన తెలిపారు.అక్రమంగా పట్టాలు చేసుకుని అసైన్డ్ భూమితో లబ్ధి పొందుతున్న సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎంపీడీవో కార్యాలయంలోని గ్రీవెన్స్ లో వినతి పత్రం అందించినట్లు ఆయన తెలిపారు.ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి సదరు సర్వే నంబర్లలో విచారణ చేపట్టి, అసైన్డ్ భూమిని కబ్జా చేసుకుని లబ్ధి పొందుతున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవడంతో పాటు, ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని అధికారులను కోరారు.ఏది ఏమైనప్పటికి ఈ సారైనా అధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరిపి, బినామీ పట్టాలను రద్దు చేసి, అసైన్డ్ భూమిని స్వాధీనం చేసుకుంటారా, లేక కాలయాపన చేస్తారా అనేది వేచి చూడాల్సిందేనని పలువురు చర్చించుకుంటున్నారు.

ప్రజావాణికి ప్రజల నుంచి ఆదరణ కరువు!

వారానికి రెండు దరఖాస్తులేనా..? అధికారుల పనితీరుపై ప్రశ్నలు!



వెంకటాపూర్ రామప్ప నవంబర్ 9 (పీపుల్స్ న్యూస్)

వెంకటాపూర్: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం వెంకటాపూర్ మండలంలో ఆశించిన స్థాయిలో స్పందన పొందడం లేదు. సోమవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి కేవలం రెండు దరఖాస్తులు మాత్రమే అందడం పలు ప్రశ్నలకు తావిస్తోంది.ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణిని ఆశ్రయించాల్సి ఉండగా, దరఖాస్తుల సంఖ్య ఇంత తక్కువగా ఉండటానికి కారణాలేమిటన్న చర్చ స్థానికంగా మొదలైంది. ప్రజలకు ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారా? లేక గతంలో ఇచ్చిన అర్జీలకు సరైన పరిష్కారం లభించక ప్రజలు ఆసక్తి చూపడం లేదా? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి సంబంధిత శాఖలకు పంపిస్తామని ఎంపీడీవో మూడ్ రాజు తెలిపారు. అయితే అర్జీలను నమోదు చేయడం, ఇతర శాఖలకు పంపించడం వరకే పరిమితమైతే ప్రజావాణి నిర్వహణకు అసలు అర్థం ఏముంటుంది? అర్జీదారులకు సమస్య పరిష్కారం ఎప్పుడు లభిస్తుందో స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.ప్రభుత్వం ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమాన్ని అధికారులు కేవలం మొక్కుబడిగా నిర్వహించకుండా, గ్రామాల్లో విస్తృత ప్రచారం కల్పించి ప్రజల సమస్యలకు ప్రాధాన్యత ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.దరఖాస్తుల సంఖ్య కాదు ముఖ్యం.. పరిష్కారమైన ప్రజా సమస్యల సంఖ్య ముఖ్యం. ప్రజావాణి ఫలితాలు చూపిస్తుందా? లేక కాగితాలకే పరిమితమవుతుందా? అనేది వేచి చూడాలి.

గచ్చిబౌలిలో తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలు.. యువకుడి అరెస్ట్

హైదరాబాద్, నవంబర్ 11: నగరంలోని గచ్చిబౌలిలో తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న లిమ్మక అనంత్ కుమార్(28)ని పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి 35 తులాల బంగారం, 2 కిలోల వెండితోపాటు యాక్టివా వాహనం, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అతడిని గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అన్‌లైన్ బెట్టింగుల ద్వారా భారీగా అప్పుల పాలైనట్లు తమ విచారణలో నిందితుడు వెల్లడించాడని తెలిపారు.

ఈ నేపథ్యంలో సులువుగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశ్యంతో అతడు ఈ చోరీల బాట పట్టినట్లు చెప్పారని పోలీసులు వివరించారు. పక్కా సమాచారంతో గచ్చిబౌలి ఎక్స్‌రోడ్స్ వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని పోలీసులు చెప్పారు. నవంబర్ 2వ తేదీన కొండాపూర్ శిల్పా వ్యాలీలోని ఓ అపార్ట్‌మెంట్‌లో భారీ చోరీ జరిగింది. ఈ ఇంట్లోని అల్మారాలో 35 తులాల బంగారంతోపాటు 2 కిలోల వెండిని అతడు దొంగిలించాడు.దీంతో బాధితులు గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా చోరీ జరిగిన అపార్ట్‌మెంట్ పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరాలను పోలీసులు పరిశీలించారు. టెర్రస్ మీద నుంచి తాడు ద్వారా నిందితుడు బాల్కనీలోకి దిగి స్లైడింగ్ డోర్ పగులగొట్టి.. ఈ చోరీకి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. నిందితుడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. దాంతో గచ్చిబౌలి క్రాస్ రోడ్డు వద్ద పోలీసులకు అనంత్ కుమార్ చిక్కాడు.

సకాలంలో అందించే టీకాలతో ప్రాణాంతక వ్యాధులకు చెక్! - చిన్నారుల వ్యాక్సిన్లపై కిమ్స్ వైద్యుల అవగాహన

హైదరాబాద్ పిల్లలకు జ్వరం వస్తే వెంటనే మందులు వేస్తాం. తగ్గలేదంటే వెంటనే వైద్యుడి దగ్గరకు తీసుకెళ్తాం. కానీ కొన్ని వ్యాధులు రాకుండా ముందుగానే రక్షణ కల్పించే టీకాల విషయంలో మాత్రం కొంతమంది తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేస్తుంటారు. మరికొందరు టీకాల వల్ల జ్వరం వస్తుందని భావిస్తారు. చిన్నారులకు ఎక్కువ టీకాలు ఇస్తే ఆరోగ్యంపై ప్రభావం పడుతుందని కర్నీడా భయపడుతుంటారు. ఇలాంటి అపోహల కారణంగా పిల్లలకు సకాలంలో వ్యాక్సిన్? వేయించకపోవడం ప్రమాదకరమని వైద్యులు చెబుతున్నారు. వ్యాక్సిన్లు అనేక ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ కల్పించడమే కాకుండా వ్యాధుల వ్యాప్తిని కూడా తగ్గిస్తాయని సికింద్రాబాద్ కిమ్స్ వైద్యులు టీకాలపై అవగాహన కల్పించారు.మన శరీరంలోకి వ్యాధికారక క్రిములు ప్రవేశించినప్పుడు వాటితో పోరాడేందుకు రోగనిరోధక వ్యవస్థ పనిచేస్తుంది. అయితే కొన్ని వ్యాధులు శరీరంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. ఇలాంటి



వ్యాధులు రాకుండా ముందుగానే శరీరాన్ని సిద్ధం చేసేవే టీకాలు. వీటిని తీసుకున్నప్పుడు మన రోగనిరోధక వ్యవస్థ సంబంధిత వ్యాధికారకాన్ని గుర్తించడం, దాంతో పోరాడటం నేర్చుకుంటుంది. భవిష్యత్తులో ఆ క్రిములు శరీరంలోకి ప్రవేశించినా వాటిని ఎదుర్కొనే సామర్థ్యం పెరుగుతుంది. అంటే వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స చేయడం కంటే, ముందుగానే రక్షణ కల్పించడమే టీకాల ముఖ్య ఉద్దేశం.పిల్లలకు చిన్న వయసులోనే అనేక వ్యాక్సిన్లు వేయించాల్సి ఉంటుంది. పోలియో వల్ల శాశ్వత వైకల్యం వచ్చే ప్రమాదం ఉంది. మీజిల్స్ (తట్టు) ద్వారా న్యుమోనియా, మెదడువాపు రావచ్చు. డిఫ్తీరియా గొంతుకు ప్రమాదకరమైన ఇన్‌ఫెక్షన్ కలిగిస్తుంది. కోరింత దగ్గు చిన్నారుల్లో శ్వాస సమస్యలకు దారితీయొచ్చు. టెటనస్, హెపటైటిస్-బి, రోటావైరస్ వల్ల వచ్చే తీవ్ర విరేచనాలు, న్యుమోకాకల్ ఇన్‌ఫెక్షన్ల వంటి వ్యాధుల నుంచి కూడా సంబంధిత టీకాలు రక్షిస్తాయి.

రామప్ప అందాలకు ముగ్ధురాలైన ఇంగ్లండ్ అతిథి సోపీ





వెంకటాపూర్,(రామప్ప) నవంబర్ 9 పీపుల్స్ న్యూస్

ములుగు ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన, యునెస్కో ప్రపంచ వారసత్వ కట్టడమైన రామప్ప దేవాలయాన్ని ఇంగ్లండ్ దేశానికి చెందిన సోపీ సందర్శించారు.కాకతీయ శిల్పుల అద్భుత సృష్టి అయిన రామప్ప దేవాలయ శిల్పకళ, రాతి స్తంభాలపై చెక్కిన అపురూప శిల్పాలు, దేవాలయ నిర్మాణంలో వాడిన తేలికపాటి ఇటుకల విశిష్టత ఆమెను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

ఈ సందర్భంగా గైడ్ గోరంటాల విజయ్ దేవాలయ చరిత్ర, కాకతీయుల పాలన, రామప్ప చెరువు, శిల్పాల వెనుక ఉన్న కథలను వివరంగా వివరించారు. ఆసక్తిగా వింటూ, ప్రతి శిల్పాన్ని పరిశీలిస్తూ సోపీ తన కెమెరాలో అందమైన దృశ్యాలను బంధించారు.రామప్పను చూడటం తన జీవితంలో మరచిపోలేని అనుభవమని, మరోసారి తప్పకుండా వస్తానని ఆమె సంతోషంగా తెలిపారు. అనంతరం గైడ్ గోరంటాల విజయ్‌తో కలిసి దేవాలయం ముందు జ్ఞాపకార్థం ఫోటోలు దిగారు.

దీపావళి పర్వదినం సందర్భంగా బాలానగర్ డివిజన్‌లోని శ్మశానవాటికలకు కొత్త కళ

- పారిశుద్ధ్య పనులు, పిచ్చిమొక్కల తొలగింపు, విద్యుత్ దీపాల పునరుద్ధరణ..
- ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు



బాలానగర్ నవంబర్ 10 (పీపుల్స్ న్యూస్)

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మూసా పేట సర్కిల్ బాలానగర్ డివిజన్ పరిధిలో దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని బాలానగర్ డివిజన్ పరిధిలోని అన్ని శ్మశానవాటికల్లో పారిశుద్ధ్య, సుందరీకరణ పనులను పూర్తి చేయించారు. పండుగ సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, శ్మశానవాటికలను పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు చేప ట్టారు. ఈ సందర్భంగా బాలానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడి, డివిజన్ పరిధిలోని అన్ని శ్మశానవాటికల్లో తక్షణమే అవసరమైన పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సూచించారు. ఆయన విజ్ఞప్తిపై స్పందించిన అధికారులు వెంటనే పనులు ప్రారంభించి పూర్తిచేశారు. ఈ పనుల్లో భాగంగా శ్మశాన వాటికల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని పూర్తిగా తొలగించారు. పరిసరాల్లో పెరిగిన పిచ్చిమొక్కలు, కంపచెట్లను ఏరివేసి శుభ్రం చేశారు. పనిచేయకుండా ఉన్న విద్యుత్ దీపాలను మరమ్మతులు చేయించి తిరిగి వినియోగంలోకి తీసుకొ చ్చారు. పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్ది, ప్రజలకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పండుగల సమయంలోనూ మౌలిక సదుపాయాల విష యంలో నిర్లక్ష్యం లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన పనులను గుర్తించి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ప్రజల అవసరాలే ప్రథమ ప్రాధాన్యం.. బాలానగర్ అభివృద్ధే మా ప్రధాన ధ్యేయం అని ఆవుల రవీందర్ రెడ్డి స్పష్టం చేశారు.

దుండిగల్--59లో బిల్డర్ల బరితెగింపు.. అధికారుల జేబులు నిండుతున్నాయా?

- అక్రమ సెల్లార్లకు పచ్చజెండా.. టౌన్‌ప్లానింగ్ అధికారుల మౌనమే మర్మమా?
- నిర్మాణదారులే బాస్‌లు.. అధికారులు కేవలం ప్రేక్షకులా?
- లంచాల ఆరోపణలతో సర్కిల్--59 కలకలం.. అక్రమ నిర్మాణాలకు అండ ఎవరు?
- సెల్లార్ల దందా.. అధికారుల మౌనం! దుండిగల్‌లో నిబంధనలకు తూట్లు?
- బిల్డర్లకు స్వేచ్ఛ.. ప్రజలకు చట్టాల చుట్టూ ఉచ్చు!









కుత్బుల్లాపూర్ : నవంబర్ 9 (పీపుల్స్ న్యూస్)

అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాల్సిన అధికారులే అండగా నిలుస్తున్నారా? నిబంధనలను అమలు చేయాల్సిన టౌన్‌ప్లానింగ్ శాఖ.. నిర్మాణదారుల కనుసైగలకు తలొగ్గుతోందా? దుండిగల్ సర్కిల్--59 పరిధిలో అక్రమ సెల్లార్లు, కమర్షియల్ భవన నిర్మాణాలపై వ్యక్తమవుతున్న ఆరోపణలు ఇప్పుడు అధికారుల పనితీరును ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయి. నిర్మాణ పనులు యుద్ధప్రాతిపదికన సాగుతున్నా.. వాటిని పరిశీలించాల్సిన సెక్షన్ ఆఫీసర్, ఏసీపీ స్థాయి అధికారులు ఎక్కడున్నారన్న ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి. నిబంధనలకు తూట్లు పొడుస్తూ నిర్మాణాలు సాగుతున్నాయన్న ఆరోపణలపై అధికారులు స్పందించకపోవడం వెనుక అసలు మర్మమేమిటి?

బిల్డర్ల బరితెగింపు.. అధికారుల బలహీనతా?

నిర్మాణదారులు సెల్లార్లు తవ్వుతున్నారు.. కమర్షియల్ భవనాలు నిర్మిస్తున్నారు.. పనులు మాత్రం ఆగకుండా సాగుతున్నాయి. మరి టౌన్‌ప్లానింగ్ అధికారుల పర్యవేక్షణ ఎక్కడ? అనుమతులు ఉన్నాయా? ఆమోదిత ప్రణాళికలకు అనుగుణంగా నిర్మాణాలు జరుగుతున్నాయా? సెల్లార్ పార్కింగ్ కోసమేనా? లేక వాణిజ్య అవసరాలకు వినియోగించేందుకు సిద్ధమవుతున్నారా? ఈ ప్రశ్నలకు సమాధానాలు చెప్పాల్సిన అధికారులు ఎందుకు మౌనంగా ఉంటున్నారు? నిర్మాణదారుడి వేగానికి అధికారుల చర్యలు కూడా వేగం అందుకోలేకపోతున్నాయా? లేక ఉద్దేశపూర్వకంగానే కళ్లు మూసుకుంటున్నారా?

సెక్షన్ ఆఫీసర్ నుంచి ఏసీపీ వరకు.. బాధ్యత ఎవరిది?

క్షేత్రస్థాయిలో నిర్మాణాలను పర్యవేక్షించాల్సిన సెక్షన్ ఆఫీసర్ బాధ్యత ఏమిటి? అక్రమ నిర్మాణాలను గుర్తించి చర్యలు తీసుకోవాల్సిన ఏసీపీ విధులు ఎక్కడికి పోయాయి? నిర్మాణాలు పూర్తయ్యే వరకు వేచి చూసి.. ఆ తర్వాత నోటీసులు, కూల్చి వేతల పేరుతో హడావుడి చేయడమే అధికారుల విధానమా? నిర్మాణం జరుగుతున్న సమయంలోనే అడ్డుకునే అధికారం లేదా? అక్రమాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నప్పుడు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించకపోవడం విధి నిర్వహణలో నిర్లక్ష్యంకాదా?ఉన్నతాధికారులు ప్రశ్నలకు సమాధానం చెప్పాలి.



లంచాల మత్తులో నిబంధనలు మరిచారా?

దుండిగల్ సర్కిల్--59 పరిధిలో నిర్మాణదారులకు అనుకూలంగా అధికారులు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. లంచాలకు అలవాటు పడి అక్రమ నిర్మాణాలను చూసీచూడనట్లు వదిలేస్తున్నారన్న విమర్శలు స్థానికంగా వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలు నిజమా కాదా అన్నది విచారణలో తేలాల్సి ఉంది. అయితే ప్రజల్లో అనుమానాలు రేకెత్తించేలా అధికారుల మౌనం కొనసాగడం మాత్రం ఆందోళన కలిగిస్తోంది. అక్రమ నిర్మాణాలకు తెరవెనుక సహకారం అందిస్తున్నది ఎవరు? ముడుపుల ఆరోపణలపై విచారణ జరిపేందుకు అధికారులు సిద్ధమా? నిర్మాణ అనుమతుల ఫైళ్లు, తనిఖీ నివేదికలు, జారీ చేసిన నోటీసులను పరిశీలిస్తే అసలు వ్యవహారం బయటపడదా?

సామాన్యుడికి చట్టం.. బిల్డర్‌కు మినహాయింపులా?

సామాన్యుడు చిన్న గోడ నిర్మించినా నిబంధనల పేరుతో నోటీసులు జారీ చేసే అధికారులు.. భారీ కమర్షియల్ నిర్మాణాల విషయంలో మాత్రం ఎందుకు మౌనంగా ఉంటున్నారు? ఒకే శాఖకు రెండు రకాల చట్టాలా? ప్రజల ఇళ్లపై కొరడా ఝుళిపించే టౌన్‌ప్లానింగ్ శాఖ.. బడా నిర్మాణదారుల విషయంలో ఎందుకు వెనుకడుగు వేస్తోంది? చట్టం అందరికీ సమానంగా అమలుకావాల్సిన అవసరం లేదా? నిర్మాణదారుడికి ఒక న్యాయం.. సామాన్యుడికి మరో న్యాయం అమలవుతోందన్న అనుమానాలకు అధికారులే సమాధానం చెప్పాలి.

అక్రమ నిర్మాణాలకు రక్షణ కవచం అధికారుల మౌనమేనా?

నిర్మాణాలు జరుగుతున్న సమయంలోనే స్పందించాల్సిన అధికారులు మౌనంగా ఉంటే.. అక్రమ నిర్మాణదారులకు మరింత ధైర్యం కలగదా? నిబంధనలు ఉల్లంఘించినా చర్యలు ఉండవన్న భావన ఏర్పడితే ప్రభుత్వ యంత్రాంగంపై ప్రజలకు నమ్మకం ఎలా ఉంటుంది? సెల్లార్లు, పార్కింగ్, సెట్‌బ్యాక్‌లు, నిర్మాణ విస్తీర్ణం, వాణిజ్య వినియోగంపై సమగ్ర తనిఖీలు నిర్వహించాలి. ఉల్లంఘనలు నిర్ధారణ అయితే నిర్మాణదారులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. విధుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులను కూడా బాధ్యులుగా గుర్తించాలి.

ఉన్నతాధికారులారా.. మౌనం వీడండి!

దుండిగల్ సర్కిల్--59 పరిధిలో జరుగుతున్న అక్రమ సెల్లార్, కమర్షియల్ భవన నిర్మాణాలపై ఉన్నతాధికారులు తక్షణమే విచారణ చేపట్టాలి. మంజూరైన అనుమతులు, ఆమోదిత ప్రణాళికలు, క్షేత్రస్థాయి నిర్మాణాలను పోల్చి పరిశీలించాలి. లంచాల ఆరోపణలపై స్వతంత్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలి. అక్రమ నిర్మాణాలకు సహకరించినట్లు తేలితే సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి. నిర్మాణదారుడి కనుసైగే అధికారులకు ఆదేశమా? లంచాల ఆరోపణలే టౌన్‌ప్లానింగ్ శాఖ పని తీరును శాసిస్తున్నాయా? సర్కిల్--59లో చట్టం అమలవుతుందా? లేక బిల్డర్ల బరితెగింపే కొనసాగుతుందా?అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ప్రేక్షకపాత్రకు పరిమితమై తే.. ప్రజల ఆస్తులు, భద్రత, ప్రభుత్వ నిబంధనలకు రక్షణ ఎవరు కల్పిస్తారు? దుండిగల్ సర్కిల్--59లో జరుగుతున్న వ్యవహారాలపై ఉన్నతాధికారులు ఇప్పటికైనా మేల్కొంటారా? లేక నిర్మాణాలు పూర్తయ్యే వరకు మౌనమే తమ విధిగా భావిస్తారా? ప్రజల ప్రశ్న లకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత సంబంధిత అధికారులదే!

సైబరాబాద్ పోలీసుల ఆధీనంలో 422 వాహనాలు.. బహిరంగ వేలానికి రంగం సిద్ధం!

- బౌరంపేటలో నిరుపయోగంగా, యజమానులు లేని వాహనాల నిల్వ.. ఆరు నెలల్లో యాజమాన్య హక్కులు నిరూపించుకోవాలి
- సైబరాబాద్ పోలీసుల ప్రకటన.. అభ్యంతరాలు ఉంటే సీపీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచన

సైబరాబాద్ కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో నవంబర్ 9 (పీపుల్స్ న్యూస్)

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో యజమానులు లేని, ఎవరూ క్లెయిమ్ చేయని వాహనాలపై పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. వివిధ రకాల కంపెనీలకు చెందిన మొత్తం 422 వాహనాలను బౌరంపేటలో ఒకేచోట భద్రపరిచారు. ఈ వాహనాలను ఆన్‌లైన్ లేదా బహిరంగ వేలం ద్వారా విక్రయించేందుకు సైబరాబాద్ పోలీసులు చర్యలు చేపట్టారు.

సైబరాబాద్ మెట్రోపాలిటన్ ఏరియా పోలీస్ చట్టం--2004లోని సెక్షన్ 6(2), 7తో పాటు హైదరాబాద్ సిటీ పోలీస్ చట్టంలోని సెక్షన్లు 39, 40, 41 ప్రకారం ఈ వాహనాలను వేలం వేయనున్నట్లు పోలీసుల పత్రికా ప్రకటనలో వెల్లడించారు.

ఆరు నెలలే గడువు.. ఆధారాలు చూపించాలి!

వేలం ప్రక్రియపై అభ్యంతరాలు ఉన్నవారు, వాహనాల యాజమాన్య హక్కులు లేదా తనఖా హక్కులు కలిగిన వారు నోటిఫికేషన్ తేదీ నుంచి ఆరు నెలలలోపు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుని తమ హక్కులను నిరూపించుకోవాలని పోలీసులు సూచించారు. నిర్ణీత గడువులోగా ఎవరూ క్లెయిమ్ చేయకపోతే ఆ వాహనాలను ఆన్‌లైన్ లేదా బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నారు.

వాహనాల వివరాలకు సంప్రదించండి.

బౌరంపేటలో భద్రపరిచిన 422 వాహనాల వివరాలు సైబరాబాద్ పోలీసుల అధికారిక వెబ్‌సైట్ ఎఇఇ.ఎఎఎవఝిఝుఎజూశీశ్రీఅఎవ.స్త్రశీజ.అఅలో అందుబాటులో ఉంటాయని తెలిపారు. వాహనాలకు సంబంధించిన వివరాల కోసం మీూ, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ వీ. విజయానంద్‌ను 8712663357 నంబర్‌లో సంప్రదించవచ్చని పోలీసులు పేర్కొన్నారు.

బాలానగర్ లోని చరబండ రాజునగర్ శ్మశానవాటికకు మహర్దశ

- ప్రజల ఇబ్బందులకు పరిష్కారం.. దీపావళికి ముందే శుభ్రత పనులు పూర్తి

బాలానగర్ నవంబర్ 10 (పీపుల్స్ న్యూస్)

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మూసా పేట సర్కిల్ బాలానగర్ డివిజన్ పరిధిలోని చరబండ రాజునగర్ శ్మశానవాటికలో నెలకొన్న అపరిశుభ్రత, పిచ్చిమొక్కలు, చెట్ల సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. గత పదేళ్లుగా చెట్లు, పొదలతో నిండిపోయి అడవిని తలపించేలా మారిన ఈ శ్మశానవాటికను అధికారులు పూర్తిస్థాయిలో శుభ్రం చేయడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో శ్మశానవాటికలో పెద్దఎత్తున చెట్లు, పొదలు పెరిగి దట్టమైన అడవిని తలపించే పరిస్థితి ఉండేది. దీంతో పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజలు దోమలు, కీటకాలు, విషసర్పాల భయంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ముఖ్యంగా దీపావళి పండుగ సందర్భంగా తమ కుటుంబ సభ్యులను కోల్పోయిన వారు వారి సమాధుల వద్దకు వెళ్లి పూలదండలు వేసి నివాళులర్పించడం ఆనవాయితీ. అయితే శ్మశానవాటికలో చెట్లు, పొదలు విపరీతంగా పెరిగిపోవడంతో లోపలికి వెళ్లేందుకు కూడా ప్రజలు భయపడే పరిస్థితి నెలకొంది. ఈ సమస్యను పరిష్కరించాలంటూ



స్థానిక ప్రజలు పలుమార్లు విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాలానగర్ డివిజన్‌లో నిర్వహించిన ఒక రోజు -- ఒక వార్డు కార్యక్రమంలో ఈ సమస్య అధికారుల దృష్టికి వెళ్లింది. సైబర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌తో పాటు టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్‌కు కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం అధ్యక్షుడు మట్టే ప్రసన్నకుమార్, స్థానిక కాంగ్రెస్ నాయకులు శ్మశానవాటిక దుస్థితిని వివరించి సమస్యను పరిష్కరించాలని కోరారు. దీనిపై స్పందించిన బండి రమేష్ దీపావళి పండుగలోపే శ్మశానవాటికలో పేరుకుపోయిన చెట్లు, పొదలను తొలగించి, పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని సంబంధిత అధికారులను కోరారు. ఆయన విజ్ఞప్తికి స్పందించిన అధికారులు వెంటనే చర్యలు చేపట్టి శుభ్రత పనులను పూర్తి చేశారు. దీంతో ప్రస్తుతం చరబండ రాజునగర్ శ్మశానవాటిక పరిశుభ్రంగా మారడంతో స్థానిక ప్రజలు ఎలాంటి భయం, ఆందోళన లేకుండా తమ కుటుంబ సభ్యుల సమాధుల వద్దకు వెళ్లి పూలదండలు వేసి నివాళులు అర్పించారు. దీపావళి పండుగ వేళ తమ వారి జ్ఞాపకాలను ప్రశాంతంగా స్మరించుకునే అవకాశం కల్పించినందుకు స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం వల్లే ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుతాయని ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు.

రైతుల పొలాలు ఎండిపోతుంటే.. అక్రమార్కుల జేబులు నిండుతున్నాయా?

■ లాల్ సాబ్ గూడాలో విచ్చలవిడిగా నీటి విక్రయాలు.

■ నోటీసులతోనే సరిపెడుతున్న జీపీఓ అధికారులు!



కుత్బుల్లాపూర్, నవంబర్ 9 (పీపుల్స్ న్యూస్)

ఒకవైపు సాగునీరు అందక రైతులు పంటలు ఎండిపోతూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంటే.. మరోవైపు నీటిని అక్రమంగా విక్రయిస్తూ కొందరు లక్షల రూపాయలు దండుకుంటున్నారనే ఆరోపణలు స్థానికంగా కలకలం రేపుతున్నాయి. కుత్బుల్లాపూర్ రెవెన్యూ మండల పరిధిలోని లాల్ సాబ్ గూడా ప్రాంతంలో విచ్చలవిడిగా సాగుతున్న నీటి విక్రయాలపై సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

నీటి కష్టాలు ప్రజలకు.. లక్షల ఆదాయం అక్రమార్కులకు!

నీరు ప్రజల జీవనాధారం. రైతులకు పంటల ప్రాణం. అలాంటి



నీటిని కొందరు వ్యాపారంగా మార్చుకొని ఇష్టారాజ్యంగా విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నీటి అవసరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, మరోవైపు నీటి వ్యాపారం ద్వారా అక్రమార్కులు లక్షల రూపాయలు ఆర్జిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రైతులు పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తుంటే.. నీటిని అమ్ముకుంటున్న వారి దందా మాత్రం ఆగడం లేదనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి.

నోటీసులతోనే సరిపెడతారా.. చర్యలు తీసుకోరా?

లాల్ సాబ్ గూడా ప్రాంతంలో నీటి విక్రయాల వ్యవహారంపై జీపీఓ అధికారులు నోటీసులు జారీ చేయడమే పరిమితమా? నిబంధనలకు విరుద్ధంగా నీటి విక్రయాలు జరుగుతున్నాయనే ఆరోపణలపై క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై లేదా? నోటీసులు ఇచ్చిన తర్వాత కూడా అక్రమ వ్యాపారం కొనసాగితే అధికారుల

పర్యవేక్షణ ఎక్కడుందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

అధికారుల మౌనం వెనుక మర్మమేమిటి?

నీటి విక్రయాలకు సంబంధించి అనుమతులు ఉన్నాయా? బోర్ల ఏర్పాటుకు ఎవరు అనుమతులు ఇచ్చారు? నీటి విక్రయాలపై సంబంధిత శాఖల పర్యవేక్షణ ఉందా? నిబంధనలను ఉల్లంఘిస్తున్నట్లు తేలితే ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే అంశాలపై అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.ప్రజలకు, రైతులకు నీటి సమస్యలు ఎదురవుతున్న సమయంలో అక్రమ నీటి విక్రయాలపై అధికా రులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు మరింత బలపడు తున్నాయి. ఇప్పటికైనా జీపీఓ, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థా యిలో విచారణ చేపట్టి, నీటి విక్రయాల వెనుక ఉన్న వాస్త వాలను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

లాభసాటి వ్యవసాయానికి నాణ్యమైన విత్తన రకాలే కీలకం

■ హకీంపేట్-కొడంగల్‌లో ఘనంగా 'మెగా రైతు మేళా'

■ రైతులకు దిశానిర్దేశం చేసిన శాస్త్రవేత్తలు, అక్షయ్ సాయి సీడ్స్ ప్రతినిధులు



కొడంగల్, నవంబర్ 10 :

రైతుల ఆర్థికాభివృద్ధికి, వ్యవసాయ రంగంలో నూతన ప్రోత్సాహానికి ప్రభుత్వం చేపడుతున్న రైతు మేళాలు ఎంతో స్ఫూర్తిదాయకమని 'అక్షయ్ సాయి సీడ్స్' (హైదరాబాద్) ప్రతినిధులు పేర్కొన్నారు. హకీంపేట్ – కొడంగల్ పరిధిలో శనివారం ఘనంగా నిర్వహించిన "మెగా రైతు మేళా" కార్యక్రమంలో స్థానిక రైతులు, ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్తలు మరియు విత్తన కంపెనీల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ?ఈ సందర్భంగా అక్షయ్ సాయి సీడ్స్ ప్రతినిధులు మాట్లాడుతూ... "రైతులు సాంప్రదాయ పంటల విధానం నుంచి బయటకు వచ్చి, తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయాన్ని ఇచ్చే ఆధునిక విత్తన వంగడాలను ఎంచుకోవాలి. వాతావరణ మార్పులను తట్టుకుని నిలబడే రకాలను సాగు చేయడం ద్వారానే వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవచ్చు" అని సలహా ఇచ్చారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఇలాంటి అవగాహన వేదికలను ప్రతి ఒక్క రైతు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆధునిక సాగు పద్ధతులు పాటించాలి: వ్యవసాయ అధికారులు

కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు పలు సూచనలు చేశారు. "ప్రస్తుత కాలంలో శాస్త్రవేత్తలు మరియు వ్యవసాయ శాఖ అందించే సాంకేతిక సలహాలు పాటిస్తూ పంటలు సాగు చేయాలి. చీడపీడల నివారణకు సమగ్ర యాజమాన్య పద్ధతులు అవలంబిస్తూ, అధిక దిగుబడి ఇచ్చే నాణ్యమైన వంగడాలను ఎంపిక చేసుకుంటే ఆర్థికంగా నిలదొక్కుకోవచ్చు" అని అధికారులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సైంటిస్ట్ సుధారాణి, సైంటిస్ట్ యమున, సైంటిస్ట్ కో–ఆర్డినేటర్ ఉమా రాజ్ శేఖర్, ప్రముఖ శాస్త్రవేత్తలు భారతి, స్వాతి, అక్షయ్ సాయి సీడ్స్ సంస్థ ప్రతినిధులు, సిబ్బంది మరియు పరిసర ప్రాంతాల రైతులు విశేషంగా పాల్గొన్నారు.

కొలిక్కి వచ్చిన ఎస్ఐఆర్ ప్రక్రియ - రాష్ట్రవ్యాప్తంగా 70 లక్షల ఓట్లు తగ్గే అవకాశం!



రాష్ట్రవ్యాప్తంగా సుమారు 91.10 లక్షల మంది నోటీసులకు స్పందించి డాక్యుమెంట్లు సమర్పించి ఓటును కాపాడుకున్నారు. ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ దాదాపు కొలిక్కి వచ్చింది. సుమారు మరో 25వేల నోటీసులపైనే విచారణ పెండింగులో ఉంది. ఇప్పటి వరకు 2,61,74,795 ఓట్ల తుది జాబితాకు ఆమోదం లభించింది. సుమారు 70లక్షల ఓట్లు తగ్గే అవకాశం కనిపిస్తోంది. ముసాయిదా జాబితాలో పేరు లేని అర్హులుంటే ఇప్పటికైనా దరఖాస్తు చేసుకొనేందుకు కేంద్ర ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది.విచారణలో ఉన్నది 25వేల నోటీసులేరాష్ట్రంలో ఓటర్ల సంఖ్య సుమారు 2.70 కోట్ల వరకు తేలే అవకాశం కనిపిస్తోంది. ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ దాదాపు చివరిదశకు చేరింది. సుమారు మరో 25వేల నోటీసులపై విచారణ మాత్రమే పెండింగులో ఉంది. ఇప్పటి వరకు 2,61,74,795 ఓట్ల తుది జాబితా కోసం ఓకే అయ్యాయి. గత షెడ్యూలు ప్రకారం ఇవాళే తుది జాబితా ప్రకటించాల్సి ఉండగా కేంద్ర ఎన్నికల కమిషన్ ఈనెల 30 వరకు పొడిగించింది.ఎస్ఐఆర్ ప్రారంభం కాకముందు జాబితా ప్రకారం రాష్ట్రంలో 3,38,26,448 ఓటర్లు ఉన్నారు. జూన్ 25 నుంచి ఆగస్టు 10 వరకు జరిపిన ఎన్యుమరేషన్ ప్రక్రియలో 2,64,73,616 మంది మాత్రమే స్పందించారు. ఎన్యుమరేషన్ ఫారాలు ఇవ్వని వారి పేర్లను తొలగించి ముసాయిదా ఓటర్ల జాబితాను ఆగస్టు 17న ఎన్నికల కమిషన్ ప్రకటించింది.45 లక్షలకు పైగా అడ్రస్ మారారురాష్ట్రంలో ఎన్యుమరేషన్ దశలోనే 73,39,235 ఓట్లు తగ్గిపోయాయి. అందులో మరణించిన వారి సంఖ్య 9,22,229. ఇళ్లు షిఫ్ట్ అయిన వారు 45,18,963 మంది ఉన్నారని, మరో 11,25,546 మంది అసలు అందుబాటులోనే లేరని, 6,70,203 మంది మరో చోట ఓటు నమోదు చేసుకున్నారని సీఈవో కార్యాలయం ప్రకటించింది. వారు కాకుండా 2002 జాబితాతో మ్యాపింగ్ కాని వారితో పాటు వివరాల్లో తేడా ఉన్న 92,88,181 ఓటర్లకు నోటీసులు ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 32,36,659 ఓటర్ల పేర్లు 2002లో ఎస్ఐఆర్‌లో లేవని, మరో 60,50,918 ఓటర్లను అనామలిస్ కేటగిరిలో ప్రకటించారు.క్యూర్?లోనే 40 లక్షల మంది ఓట్లు కాపాడుకున్నారుఎనోటీసుల జాబితాలో ఉన్న వారు కాకుండా మిగిలిన 1,70,65,846 ఓటర్లే పూర్తి సేఫ్ జోన్‌లో ఉన్నారు. ఆ తర్వాత అభ్యంతరాల సమయంలో 4,88,417 మంది మళ్లీ ఓటు కోసం ఫారం 6 సమర్పించారు. నోటీసులు, అభ్యంతరాల పరిష్కార ప్రక్రియ దాదాపు ముగింపు దశకు వచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 91.10 లక్షల మంది డాక్యుమెంట్లు సమర్పించి ఓటు కాపాడుకున్నారు. హైదరాబాద్ క్యూర్ పరిధిలోనే సుమారు 40 లక్షల మంది ఓటును పదిలపరచుకున్నారు. నోటీసుల జాబితాలోని సుమారు 54 వేల ఓటర్లను అనర్హులుగా గుర్తించి తొలగించాలని నిర్ణయించారు. వారిలో ఎక్కువగా మరో చోట ఓటు ఉన్న వారేనని అధికారులు తెలిపారు.జాబితా ప్రకటించినా దరఖాస్తుకు అవకాశంఎస్ఐఆర్‌లో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 70 లక్షల ఓట్లు తగ్గే అవకాశం కనిపిస్తోంది. డ్రాఫ్ట్ లేని అర్హులు ఇప్పటికైనా దరఖాస్తు చేసుకొనేందుకు కేంద్ర ఎన్నికల కమిషన్ మరో అవకాశం ఇచ్చింది. ఈనెల 26 వరకు నోటీసులు, అభ్యంతరాలు, కొత్త దరఖాస్తుల క్లియర్‌కు గడువు ఉంది. ఈనెల 30న తుది జాబితా ప్రకటించనున్నారు. తుది జాబితా ప్రకటించిన తర్వాత కూడా అర్హులైన ఓటర్లు తమ పేరు లేకపోతే మళ్లీ దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంటుందని సీఈవో కార్యాలయం తెలిపింది.

రామప్ప సరస్సుకు నీటి పంపింగ్‌తో రైతుల్లో కొత్త ఆశలు!

■ మరో ఆరు అడుగుల నీరు చేరితే రెండో పంటకు మార్గం సుగమం

■ 6 వేల ఎకరాల రైతుల ఎదురుచూపులు



వెంకటాపూర్ రామప్ప నవంబర్ 9 (పీపుల్స్ న్యూస్)

ములుగు జిల్లా: రామప్ప సరస్సులోకి దేవాదుల నీటి పంపింగ్ కొనసాగుతున్న నేపథ్యంలో ఆయకట్టు రైతుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. ప్రస్తుతం సరస్సులో 30 అడుగుల నీటిమట్టం ఉండగా, మరో ఆరు అడుగుల నీరు చేరితే రెండో పంటకు సాగునీరు అందే అవకాశం ఉందని రైతులు ఆశిస్తున్నారు.

ప్రచారాలు కాదు.. రైతులకు కావాల్సింది సాగునీరు!

దేవాదుల నుంచి నీటి పంపింగ్ నిరంతరాయంగా కొనసాగితేనే రైతుల ఆశలు నెరవేరుతాయి. మధ్యలో పంపింగ్ నిలిచిపోతే రెండో పంటపై ఆశలు ఆవిరయ్యే పరిస్థితి నెలకొంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.రామప్ప సరస్సు ఆయకట్టు పరిధిలోని సుమారు 6 వేల ఎకరాలకు సాగునీరు అందితే రెండో పంట సాగు చేసుకునే అవకాశం కలుగుతుంది. దీనివల్ల రైతులతో పాటు వ్యవసాయ కూలీలకు కూడా ఆరు నెలల పాటు ఉపాధి లభిస్తుంది.

అధికారులకు రైతుల ప్రశ్నలు..

రైతులకు రెండో పంట సాగునీరు అందించేందుకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? దేవాదుల పంపింగ్ నిరంతరాయంగా కొనసాగిస్తారా? రామప్ప సరస్సును అవసరమైన నీటిమట్టానికి నింపే బాధ్యత ఎవరిది?రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని, దేవాదుల నీటి పంపింగ్‌ను నిరంతరాయంగా కొనసాగించి రెండో పంటకు సాగునీరు అందించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కలకలం!

■ జెడ్పీహెచ్ఎస్ పాఠశాల పక్కన వాటర్ ట్యాంక్ సమీపంలో మృతదేహం గుర్తింపు

■ మృతుడి వయస్సు సుమారు 50--55 ఏళ్లు.. గాంధీ ఆసుపత్రికి తరలింపు

సైబరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో నవంబర్ 9 (పీపుల్స్ న్యూస్)

బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కలకలం రేపింది. సోమవారం ఉదయం సుమారు 11 గంటల సమయంలో జెడ్పీహెచ్ఎస్ పాఠశాల పక్కన ఉన్న హెచ్ఎండబ్ల్యూఎస్ వాటర్ ట్యాంక్ పరిసరాల్లోని ఖాళీ స్థలంలో ఓ వ్యక్తి మృతదేహం నేలపై పడి ఉండటాన్ని స్థానికులు గుర్తిం



చారు.సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరు కుని పరిశీలించారు. మృతుడి వయస్సు సుమారు 50 నుంచి 55 సంవత్సరాల మధ్య ఉంటుందని, భిక్షాటన చేసు కునే వ్యక్తి గా భావిస్తున్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. మృతుడి శరీరంపై ఎలాంటి బాహ్య గాయాలు కనిపించలేదని పోలీసులు తెలిపారు.

మృతుడి ఆనవాళ్లు ఇవే..

మృతుడు తెల్ల రంగు ఫుల్‌షర్ట్, ఆకుపచ్చ రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. ముఖం కుడి చెంపపై పాత గాయం గుర్తు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.మృతదేహాన్ని తదుపరి చర్యలు, వైద్య పరీక్షల నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలిసినవారు బాచుపల్లి పోలీసులను సంప్రదించాలని సూచిస్తున్నారు. మృతికి గల కారణాలు పోస్టుమార్టం, పోలీసుల తదుపరి దర్యాప్తులో వెల్లడికానున్నాయి.

మెగా రైతు మేళాకు శ్రీరంగాపూర్ మండల రైతులు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో హకీంపేటకు తరలివెళ్లిన కాంగ్రెస్ నాయకులు, రైతులు....



శ్రీరంగాపూర్, నవంబర్ 9 తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం హకీంపేట గ్రామంలో నిర్వహిస్తున్న మెగా రైతు మేళా అండ్ ఇండస్ట్రియల్ ఎక్స్‌పో--2026 కార్యక్రమానికి శ్రీరంగాపూర్ మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్న నేపథ్యంలో శ్రీరంగాపూర్ మండల పట్టణ అధ్యక్షుడు కుమ్మరి గోవింద్ ఆధ్వర్యంలో మండలంలోని రైతులు, కాంగ్రెస్ నాయకులు హకీంపేటకు బయలుదేరారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు శేఠమోని రామచంద్రయ్య యాదవ్, బహుజన రమేష్, రామరాజు, బీఎల్ఏ కాలమ్మూర్తి, మండల కాంగ్రెస్ పార్టీ ఉప సర్పంచ్ కళ్యాణి, కారి కాజా తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంట్లో ఘనంగా దీపావళి సంబరాలు.

- నిరుపేద కుటుంబం సొంతింటి కల సాకారం
- లబ్ధిదారుల కుటుంబంతో కలిసి పండుగ వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



పెద్దమందడి నవంబర్ 9

కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ నిరుపేదల సొంతింటి కలను సాకారం చేస్తోందని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వనపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కృషితో అర్హులైన పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి నిర్మించి అందిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంట్లో లబ్ధిదారుల కుటుంబం నిర్వహించిన దీపావళి వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని కుటుంబ సభ్యులతో కలిసి పండుగ సంబరాలను జరుపుకున్నారు. నూతన గృహంలో దీపాల వెలుగుల మధ్య కుటుంబ సభ్యుల ఆనందాన్ని పంచుకుంటూ వారికి దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పేదల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు చేరుతున్నాయని, ఇందిరమ్మ ఇళ్లు అందుకు నిదర్శనమని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సూర్య గంగమ్మ రవి, ఉప సర్పంచ్ ఉషన్న యాదవ్, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పల్లె సత్యనారాయణ, కుమారి బాలస్వామి, మద్దెలలోని బుచ్చన్న, రాధాకృష్ణ ఐ, ప్రవీణ్ రెడ్డి, గట్టు రాజశేఖర్, ఆవుల రాజు, ఎస్. శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. ప్రతి పేద కుటుంబం ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి నాయకత్వంలో నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలని నాయకులు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజలందరికీ దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

కొడంగల్‌లో సీఎం రేవంత్ రెడ్డి పాదయాత్రలో పాల్గొన్న ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే వంశీకృష్ణ



కొడంగల్ : కొడంగల్ నియోజకవర్గంలో తెలంగాణ ముఖ్యమంత్రి శ్రీ అనుముల రేవంత్ రెడ్డి చేపట్టిన పాదయాత్రలో ఎంపీ డాక్టర్ మల్లు రవి, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రారంభం: పోలేపల్లి దేవాలయం వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పాదయాత్రను ప్రారంభించారు. భాగస్వామ్యం: ఈ యాత్రలో తెలంగాణ రాష్ట్ర ఎంపీల పోరం కన్వీనర్, నాగర్ కర్నూల్ ఎంపీ, పీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ డాక్టర్ మల్లు రవి మరియు అచ్చంపేట ఎమ్మెల్యే, పీసీసీ ఉపాధ్యక్షులు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ముఖ్యమంత్రితో కలిసి అడుగులు వేశారు. లక్ష్యం: ప్రజా సంక్షేమం, అభివృద్ధి, ప్రజా పాలన ధ్యేయంగా సాగుతున్న ఈ కార్యక్రమంలో నాయకులు ప్రజలతో మమేకమయ్యారు. "ప్రజల కోసం ప్రయాణం... అభివృద్ధి కోసం అడుగులు..." అనే సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఈ సందర్భంగా నాయకులు తెలిపారు.

సీసీ కెమెరాలు, యాంటీ డ్రగ్స్, సైబర్ క్రైమ్‌పై అవగాహన కార్యక్రమం

వెంకటాపూర్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన





వెంకటాపూర్ (రామప్ప) నవంబర్ 09 (పీపుల్స్ న్యూస్)

వెంకటాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజలకు సీసీ కెమెరాల వినియోగం, మాదకద్రవ్యాల నివారణ (యాంటీ డ్రగ్స్), సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద, వ్యాపార సంస్థల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాల వల్ల దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలను గుర్తించడంతో పాటు నేరాల నియంత్రణకు ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. యాంటీ డ్రగ్స్‌పై అవగాహన: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను తెలుసుకోవాలని సూచించారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా విద్య, క్రీడలు, మంచి నడవడికపై దృష్టి సారించాలని తెలిపారు. సైబర్ క్రైమ్‌పై అవగాహన: గుర్తుతెలియని వ్యక్తుల ఫోన్ కాల్స్, అనుమానాస్పద లింకులు, నకిలీ మెసేజ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటీపీ, బ్యాంకు వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ వెల్లడించవద్దని తెలిపారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. సమాజంలో నేరాల నివారణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుత పౌరులుగా వ్యవహరించాలని పోలీసులు పిలుపునిచ్చారు. ప్రజల భద్రతే పోలీసుల లక్ష్యం -- నేరాల నివారణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యం.

కైసర్ నగర్‌లో రెవెన్యూ శాఖ కొరడా!

- సర్వే నంబర్ 342లో ఆక్రమణలపై ఉక్కుపాదం.. రెండు ఇళ్లు, రెండు బేస్‌మెంట్లు నేలమట్టం!
- తహసీల్దార్ ఆదేశాలతో క్షేత్రస్థాయిలో అధికారుల చర్యలు



కుత్బుల్లాపూర్, నవంబర్ 9 (పీపుల్స్ న్యూస్)

ప్రభుత్వ భూముల ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు కొరడా ఝుళిపించారు. గాజులరామారం గ్రామ పరిధిలోని కైసర్ నగర్, సర్వే నంబర్ 342లో ఆక్రమణల తొలగింపు చర్యలు చేపట్టారు. తహసీల్దార్ బి. రాజేష్ ఆదేశాల మేరకు గ్రామ పాలన అధికారి డి. విజయ్ కుమార్ ఆధ్వర్యంలో అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు నిర్వహించారు. ఈ తొలగింపు చర్యల్లో భాగంగా రెండు ఇళ్లతో పాటు రెండు బేస్‌మెంట్లను తొలగించారు. ఆక్రమణలపై అధికారులు చేపట్టిన చర్యలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. ప్రభుత్వ భూముల పరిరక్షణలో భాగంగా ఆక్రమణలను ఉపేక్షించేది లేదని అధికారులు తెలిపారు.







రూ.2 లక్షల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన కీసర ఎస్ఐ!

- కేసుల దర్యాప్తు, చార్జిషీట్ల దాఖలు వేగవంతం చేసేందుకు లంచం డిమాండ్
- రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న సిటీ రేంజ్--2 ఏసీబీ అధికారులు.. న్యాయ రిమాండ్‌కు తరలింపు



హైదరాబాద్, క్రైమ్ బ్యూరో నవంబర్ 9 (పీపుల్స్ న్యూస్)

అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) వలలో మరో పోలీస్ అధికారి చిక్కాడు. కీసర పోలీస్ స్టేషన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న కొండారెడ్డి శ్రీనివాస్ రూ.2 లక్షల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ఏసీబీ విడుదల చేసిన పత్రికా ప్రకటన ప్రకారం.. 09-11-2026న సిటీ రేంజ్--2 ఏసీబీ అధికారులు ఈ దాడి నిర్వహించారు. కీసర పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైమ్ నంబర్లు 180/2026, 738/2026 కేసుల్లో నిందితుడిగా ఉన్న ఫిర్యాదుదారుడికి అనుకూలంగా వ్యవహరించేందుకు, దర్యాప్తును త్వరగా పూర్తి చేసి వెంటనే చార్జిషీట్లు దాఖలు చేసేందుకు ఎస్ఐ రూ.2 లక్షల లంచం డిమాండ్ చేసి స్వీకరించినట్లు ఏసీబీ వెల్లడించింది. లంచంగా తీసుకున్న రూ.2 లక్షల నగదును ఎస్ఐ వద్ద, ఆయన చూపించిన చోట నుంచి ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అధికార పదవిని దుర్వినియోగం చేస్తూ అక్రమ ప్రయోజనం పొందేందుకు ప్రయత్నించినట్లు ఏసీబీ పేర్కొంది.

న్యాయ రిమాండ్‌కు ఎస్ఐ.

ఏసీబీ అధికారులు నిందితుడైన ఎస్ఐని అరెస్టు చేసి నాంపల్లిలోని ఎస్పీఈ, ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరిచారు. అనంతరం న్యాయ రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని ఏసీబీ వెల్లడించింది. ఫిర్యాదుదారుడి భద్రత దృష్ట్యా వివరాలను గోప్యంగా ఉంచినట్లు తెలిపింది.

లంచం అడిగితే 1064కు ఫిర్యాదు చేయండి.

ప్రభుత్వ ఉద్యోగి ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే వెంటనే ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు. వాట్సాప్ నంబర్ 9440446106 ద్వారా కూడా సమాచారం అందించవచ్చని తెలిపారు. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని ఏసీబీ స్పష్టం చేసింది.

రాత్రివేళ ఇంట్లో చోరీ.. నిందితుడిని పట్టుకున్న గచ్చిబౌలి పోలీసులు!

●35 తులాల బంగారం, 2 కిలోల వెండి ఆభరణాలు స్వాధీనం

●టెర్రస్‌పై నుంచి తాడుతో బాల్కనీలోకి ప్రవేశించి చోరీ.. ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ వ్యసనమే నేరానికి కారణం!



సుమారు 35 తులాల బంగారు ఆభరణాలు, 2 కిలోల వెండి వస్తువులను అపహరించాడు.

సైబరాబాద్ కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో నవంబర్ 9 (పీపుల్స్ న్యూస్)

రాత్రి వేళ ఇంట్లో ఎవరూ లేని సమయాన్ని ఆసరాగా చేసుకుని భారీ చోరీకి పాల్పడిన నిందితుడిని గచ్చిబౌలి పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి చోరీకి గురైన సుమారు 35 తులాల బంగారు ఆభరణాలు, 2 కిలోల వెండి వస్తువులతో పాటు ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండాపూర్‌లోని శిల్పా వ్యాలీ, సారా ప్రైడ్ అపార్ట్‌మెంట్స్‌లో నివాసం ఉంటున్న పోతిరెడ్డి అనుష్ కుమార్ రెడ్డి అనే సినిమాటోగ్రాఫర్ ఇంట్లో ఈ నెల 2వ తేదీన రాత్రి 8 గంటల నుంచి 11.30 గంటల మధ్య చోరీ జరిగింది. ఇంట్లో ఎవరూ లేని విషయాన్ని గమనించిన నిందితుడు లిమ్మక అనంత్ కుమార్ (28) టెర్రస్‌పై నుంచి తాడు సహాయంతో బాల్కనీలోకి ప్రవేశించాడు. అనంతరం స్లైడింగ్ డోర్, అల్మారాను పగులగొట్టి

నాలుగు రోజుల్లోనే కేసును ఛేదించిన పోలీసులు.

ఈ ఘటనపై కేసు నమోదు చేసిన గచ్చిబౌలి క్రైమ్ టీమ్ దర్యాప్తు చేపట్టింది. సాంకేతిక ఆధారాలు, ఇతర సమాచారంతో ముందుకు సాగిన పోలీసులు నవంబర్ 8న గచ్చిబౌలి ఎక్స్‌రోడ్స్ వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు వెల్లడించారు.నిందితుడి నుంచి చోరీకి గురైన బంగారు, వెండి ఆభరణాలతో పాటు హోండా యాక్టివా స్కూటర్ (+ 08 డీజ 9862), పోవా మొబైల్ ఫోన్, రెండు సిమ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యసనంతో చోరీ బాట!

నిందితుడు ఝుట్టు దీవే యాప్ ద్వారా ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌కు అలవాటు పడి, ఆర్థిక అవసరాల కోసం ఈ చోరీకి పాల్పడినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది.

పోలీసు అధికారుల పర్యవేక్షణలో దర్యాప్తు.

శేరిలింగంపల్లి జోన్ డీసీపీ జన. శ్రీనివాస్, అదనపు డీసీపీ ఉదయ్ రెడ్డి, నార్సింగి ఏసీపీ, గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ ప్రత్యక్ష పర్యవేక్షణలో గచ్చిబౌలి డీఐ, క్రైమ్ టీమ్, పోలీసు సిబ్బంది సమన్వయంతో కేసును ఛేదించారు. నిందితుడిని అరెస్ట్ చేసి న్యాయ రిమాండ్ నిమిత్తం న్యాయస్థానంలో హాజరుపరిచారు. కేసులో తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

లట్టుపల్లి నుంచి కొడంగల్ కు బయలుదేరిన రైతులు



బిజినేపల్లి నవంబర్ 9. కొడంగల్ లో ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి రాష్ట్ర స్థాయి గా రైతు నేలకు లట్టుపల్లి గ్రామం నుంచి రైతులు ఉత్సాహంగా తరలి వెళ్లారు సర్పంచ్ మారేపల్లి శివలీల భర్త చంద్ర గౌడ్ బస్సుల్లో రైతులు కొడంగల్ కు వ్యవసాయ అభివృద్ధి సాంకేతిక పరిజ్ఞానం అవగాహన కోసం రైతులు పెద్ద ఎత్తున పయనమయ్యారు ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఫిరోజ్ రామచంద్రయ్య యాదయ్య యాదయ్య మహిళా సంఘాలు సభ్యులు పాల్గొన్నారు.

కొడంగల్ ధర్నాకు వెళ్లకుండా దివ్యాంగుల అరెస్టు

బిజినపల్లి నవంబర్ 9 కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టో కొడంగల్ ధర్నాకు పిలుపునిచ్చిన దిగ్వాంగుల పరిరక్షణ జిల్లా ప్రధాన కార్యదర్శి పరశురాములు మండల బాధ్యులు ఎద్దుల వెంకటస్వామి దింగి నరేష్ రామ్ రెడ్డిలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారూ

లక్డీకాపూల్‌లో ట్రాఫిక్‌కు కొత్త దారి!

●నవంబర్ 22న వన్‌వే విధానం ట్రయల్ రన్.. ఒక్కరోజు ప్రయోగాత్మక అమలు

●బైక్‌పై స్వయంగా క్షేత్రస్థాయి పరిశీలన చేసిన సీపీ సజ్జనర్, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్











హైదరాబాద్ కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో నవంబర్ 9 (పీపుల్స్ న్యూస్)

నగరంలో నిత్యం ట్రాఫిక్ రద్దీతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న లక్డీకాపూల్ ప్రాంతానికి ఊరట కల్పించే దిశగా హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసీ కీలక నిర్ణయం తీసుకున్నాయి. రవీంద్రభారతి--లక్డీకాపూల్--ఇక్బాల్ మినార్ జంక్షన్ల మధ్య నూతన వన్‌వే ట్రాఫిక్ విధానాన్ని నవంబర్ 22న ఒక్కరోజు ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నారు.ఈ విధానం అమలుకు అవసరమైన ఏర్పాట్లను పరిశీలించేందుకు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ స్వయంగా బైక్‌పై క్షేత్రస్థాయిలో పర్యటించారు. టీజీ ఎస్పీడీసీఎల్, జలమండలి, ఆర్టీసీ తదితర శాఖల అధికారులతో కలిసి లక్డీకాపూల్, ఇక్బాల్ మినార్, రవీంద్రభారతి, ఓల్డ్ కంట్రోల్ రూం, హెచ్‌డీఎఫ్‌సీ, పాత సైఫాబాద్ పోలీస్ స్టేషన్ జంక్షన్లను పరిశీలించారు.

వన్‌వే విధానంతో ట్రాఫిక్ చిక్కులకు చెక్!

ప్రతిపాదిత మార్గాల ప్రకారం ఓల్డ్ కంట్రోల్ రూం వైపు నుంచి రవీంద్రభారతి మీదుగా ఇక్బాల్ మినార్ వైపు వాహనాలను నేరుగా అనుమతించరు. రవీంద్రభారతి వద్ద మళ్లించి హెచ్‌డీఎఫ్‌సీ జంక్షన్, పాత సైఫాబాద్ పోలీస్ స్టేషన్, ఇక్బాల్ మినార్, సెక్రటేరియట్ జంక్షన్ మీదుగా సికింద్రాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లేలా మార్గాన్ని ఏర్పాటు చేయనున్నారు.

అదేవిధంగా నిరంకారి జంక్షన్ వైపు నుంచి హెచ్‌డీఎఫ్‌సీ, రవీంద్రభారతి మీదుగా ఓల్డ్ కంట్రోల్ రూం వైపు వెళ్లే వాహనాలను పాత సైఫాబాద్ పోలీస్ స్టేషన్ నుంచి ఇక్బాల్ మినార్ వైపు మళ్లించి, అక్కడ రైట్ టర్న్ తీసుకుని రవీంద్రభారతి మీదుగా వెళ్లేలా ట్రాఫిక్ మార్గాన్ని మార్చనున్నారు.

జంక్షన్ల రూపురేఖల్లో మార్పులు.

వాహనాల రాకపోకలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా కూడళ్లను పునఃరూపకల్పన చేయడంతో పాటు రోడ్డు ఇంజినీరింగ్ మార్పులు చేపట్టనున్నారు. రోడ్ల మరమ్మతులు, విద్యుత్ దీపాలు, దారి సూచించే బోర్డుల ఏర్పాటు, విద్యుత్ మరియు జలమండలి యుటిలిటీల మార్పులను సంబంధిత శాఖల సమన్వయంతో పూర్తి చేయనున్నారు.

ప్రజల అభిప్రాయాలకే ప్రాధాన్యం.

ట్రయల్ రన్‌కు ముందుగా స్థానిక వ్యాపారులు, నివాసితులు, నిత్యం ప్రయాణించే వారితో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. వారి అభిప్రాయాలు, సూచనలు, అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని అవసరమైన మార్పులు చేపట్టనున్నారు. నవంబర్ 22న నిర్వహించే ఒక్కరోజు ట్రయల్ రన్‌లో వాహనాల రద్దీ, ప్రయాణ సమయం, ట్రాఫిక్ ప్రవాహం, భద్రత తదితర అంశాలపై సమగ్ర సమాచారాన్ని సేకరించి విశ్లేషించనున్నారు. ప్రజల స్పందన, సాంకేతిక నివేదికల ఆధారంగానే ఈ విధానం కొనసాగింపుపై తుది నిర్ణయం తీసుకోనున్నారు.

ప్రయాణ సమయం, ఇంధనం ఆదా లక్ష్యం.

ఈ సందర్భంగా సీపీ వీసీ సజ్జనర్ మాట్లాడుతూ.. లక్డీకాపూల్‌లో ఏళ్ల తరబడి కొనసాగుతున్న ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించడమే ఈ విధానం ప్రధాన ఉద్దేశమన్నారు. జంక్షన్ల వద్ద వాహనాలు ఎక్కువసేపు నిలిచిపోకుండా నిరంతరాయంగా ప్రయాణించేలా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. దీనివల్ల ప్రయాణ సమయం, ఇంధనం ఆదా కావడంతో పాటు ప్రమాదాల తీవ్రత తగ్గే అవకాశం ఉందన్నారు.జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ మాట్లాడుతూ.. ట్రాఫిక్ పోలీసుల ప్రణాళికకు అనుగుణంగా అవసరమైన రోడ్డు ఇంజినీరింగ్ పనులు, మౌలిక వసతుల ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు.నవంబర్ 22న జరిగే ట్రయల్ రన్ సందర్భంగా వాహనదారులు ట్రాఫిక్ పోలీసుల సూచనలు పాటిస్తూ సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

కౌడిపల్లి మండలానికి 73 కళ్యాణ లక్ష్మి చెక్ లు తహసీల్దార్ కృష్ణ చెప్పారు.



మెదక్ జిల్లా బ్యూరో, నవంబర్ 09 వెల్మకన్న గ్రామానికి చెందిన కల్యాణలక్ష్మి లబ్దిదారులుగొల్ల భిక్షం , సంతోష్ గౌడ్, కొన్యాల కనకమ్మ, మౌనిక కిషన్ లకు తహసీల్దార్ కృష్ణ, వెల్మకన్న మాజీ సర్పంచ్ భాజిపేట రాజేందర్ తో కలిసి పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రభు, గ్రామ నాయకులు కుమ్మరి సతీష్ వార్డు మెంబర్ చెత్రూ పాల్గొన్నారు.

లగచర్ల ఇండస్ట్రియల్ కారిడార్‌లో భారీ రైతు బహిరంగ సభ.



లగచర్ల :హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు వివేక్ వెంకటస్వామి, దామోదర రాజనర్సింహా, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, అజారుద్దీన్, ప్రభుత్వ విప్‌లు, ఉమ్మడి మహబూబ్‌నగర్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రభుత్వ ఉన్నతాధికారులు.

'చలో కొడంగల్'కు కదిలిన పామిరెడ్డిపల్లి!..

పెద్దమందడి, నవంబర్ 9

కొడంగల్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పో, మరియు భారీ బహిరంగ సభకు పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి గ్రామం నుండి రైతు సోదరులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సోమవారం భారీ సంఖ్యలో తరలివెళ్లారు.వనపర్తి శాసనసభ్యులు శ్రీ తూడి మేఘా రెడ్డి ఆదేశాల మేరకు, డీసీసీ ఉపాధ్యక్షులు టీ. సాయి చరణ్ రెడ్డి సూచనలతో గ్రామానికి చెందిన రైతాంగం, కాంగ్రెస్ శ్రేణులు సమిష్టిగా కొడంగల్‌కు బయలుదేరారు. గ్రామ సర్పంచ్ శ్రీమతి మధిర మంజుల శ్రీశైలం, మాజీ ఎంపిటిసి ఇందిరా లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఈ ప్రయాణం సాగింది.

రైతులకు, పారిశ్రామిక ప్రగతికి వేదిక:

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వ హయాంలో రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధి, పారిశ్రామిక ప్రగతికి కల్పిస్తున్న నూతన అవకాశాలను తెలుసుకునేందుకు ఈ రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పో ఎంతో ఉపయోగకరంగా నిలవనున్నాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో గ్రామ ఉప సర్పంచ్ రాములమ్మ హనుమంతు, వార్డు సభ్యులు పద్మ, వ్యవసాయ అధికారి మహేశ్వరి, అలాగే ముఖ్య నాయకులు రాకాసి భీమ్ రెడ్డి, నాగేంద్ర, సాగర్, సందడి మన్య పు రెడ్డి, ఎండి షౌకత్, నరసింహ, వెంకటయ్యలతో పాటు పెద్ద ఎత్తు నకాంగ్రెస్ కార్యకర్తలు, గ్రామ రైతులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



నూతన అంగన్వాడి కేంద్రం పనుల పరిశీలన

నాగర్ కర్నూలు జిల్లా పెద్దకొత్తపల్లి మండలం నవంబర్ 9:

దేవల్ తిరుమలాపూర్ గ్రామంలో నూతనంగా చేపడుతున్న అంగన్వాడి కేంద్రం నిర్మాణ పనులను హౌసింగ్ ఏఈ గారు పరిశీలించడం జరిగింది.ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతి, నాణ్యత, అవసరమైన మౌలిక వసతుల గురించి పరిశీలించి సంబంధిత అధికారులతో వివరాలు తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో దేవల్ తిరుమలాపూర్ గ్రామ సర్పంచ్ శ్రీమతి పిల్లి పల్లవి శేఖర్ గారు పాల్గొని, అంగన్వాడి కేంద్రం పనులు నాణ్యతతో, త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. చిన్నారులకు మెరుగైన వసతులు -- ఆరోగ్యకరమైన, సురక్షితమైన వాతావరణం కల్పించడమే లక్ష్యం



తెలంగాణ ఆదాయంలో సరికొత్త రికార్డు - ఒక్క నెలలోనే రూ.7,735 కోట్లు వసూలు



హైదరాబాద్ :తెలంగాణ రాష్ట్ర ఆదాయానికి వాణిజ్య పన్నుల శాఖ వెన్నుదన్నుగా నిలుస్తోంది. ముఖ్యంగా అక్టోబర్ నెలలో జీఎస్టీ, వ్యాట్ వసూళ్లు గణనీయంగా పెరగడంతో ప్రభుత్వ ఖజానాకు భారీ ఆదాయం సమకూరింది. ఒక్క అక్టోబర్ నెలలోనే కమర్షియల్ ట్యాక్సెస్ నుంచి రూ.7,735 కోట్ల ఆదాయం వచ్చింది. గత ఏడాది ఇదే నెలలో వచ్చిన ఆదాయంతో పోలిస్తే 22.16 శాతం వృద్ధి నమోదైంది.

కీలకంగా మారిన వాణిజ్య శాఖ ఆదాయం

తెలంగాణ ప్రభుత్వ ఖజానాకు వాణిజ్య పన్నుల శాఖ ఆదాయం కీలకంగా మారింది. జీఎస్టీ, వ్యాట్, ప్రొఫెషనల్ ట్యాక్స్ రూపంలో వస్తున్న ఆదాయం ఈ ఆర్థిక సంవత్సరంలో గణనీయమైన వృద్ధిని నమోదు చేస్తోంది. ముఖ్యంగా అక్టోబర్ నెల వసూళ్లు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ఒక్క నెలలోనే మొత్తం రూ.7,735 కోట్ల ఆదాయం వచ్చింది. ఇందులో జీఎస్టీ ద్వారా రూ.4,590 కోట్లు, వ్యాట్ ద్వారా రూ.3,065 కోట్లు, ప్రొఫెషనల్ టాక్స్ ద్వారా రూ.80 కోట్ల లెక్కన సమకూరాయి. గతేడాది అక్టోబర్?తో పోలిస్తే ఈసారి వసూళ్లు భారీగా పెరిగాయి.

2025 అక్టోబర్‌లో ఈ మూడు పన్నుల ద్వారా రూ.6,332 కోట్ల ఆదాయం రాగా, 2026 అక్టోబర్‌లో రూ.7,735 కోట్లు వచ్చింది. అంటే రూ.1,403 కోట్ల మేర అదనపు ఆదాయం సమకూరింది. మొత్తం మీద అక్టోబర్?లో 22.16 శాతం వృద్ధి నమోదైంది. ఇందులో జీఎస్టీ ఆదాయం 17.27 శాతం పెరగగా, వ్యాట్ వసూళ్లు ఏకంగా 30.87 శాతం వృద్ధి సాధించాయి. ప్రొఫెషనల్ ట్యాక్స్ ఆదాయం 5.26 శాతం మాత్రమే పెరిగింది.

ఈ ఏడాది సగటున 16.85 శాతం వృద్ధి

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి 7 నెలల ఆదాయాన్ని పరిశీలిస్తే మరింత ఆశాజనకంగా కనిపిస్తోంది. 2026 ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు జీఎస్టీ, వ్యాట్, ప్రొఫెషనల్ ట్యాక్స్ రూపంలో మొత్తం రూ.52,110 కోట్ల ఆదాయం వచ్చింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో రూ.44,598 కోట్లు మాత్రమే సమకూరాయి. ఈసారి అదనంగా రూ.7,512 కోట్ల ఆదాయం రావడంతో ఈ ఆర్థిక ఏడాది సగటున 16.85 శాతం వృద్ధి నమోదైంది. ఈ 7 నెలల వసూళ్లలో జీఎస్టీ ప్రధాన పాత్ర పోషించింది.గత ఏడాది ఇదే కాలంలో రూ.24,974 కోట్లుగా ఉన్న జీఎస్టీ ఆదాయం ఈసారి రూ.29,627 కోట్లకు చేరింది. అంటే రూ.4,653 కోట్ల అదనపు ఆదాయం సమకూరింది. జీఎస్టీలో 18.63 శాతం వృద్ధి నమోదైంది. వ్యాట్ ఆదాయం గత ఏడాది రూ.19,049 కోట్ల నుంచి ఈసారి రూ.21,893 కోట్లకు పెరిగింది. అదనంగా రూ.2,844 కోట్లు వచ్చాయి. వ్యాట్‌లో 14.93 శాతం వృద్ధి కనిపించింది. ప్రొఫెషనల్ ట్యాక్స్ మాత్రం రూ.575 కోట్ల నుంచి రూ.590 కోట్లకు చేరి, 2.61 శాతం మాత్రమే వృద్ధిని నమోదు చేసింది.

ఇదే స్థాయిలో కొనసాగితే లక్ష్యాలను చేరుకునే అవకాశం

మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన వార్షిక బడ్జెట్ లక్ష్యాలతో పోల్చితే 7 నెలల్లోనే గణనీయమైన పురోగతి కనిపిస్తోంది. 2026--27 ఆర్థిక సంవత్సరానికి స్టేట్ జీఎస్టీ ద్వారా రూ.52,490 కోట్ల ఆదాయాన్ని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. అక్టోబర్ నాటికి రూ.29,627 కోట్లు వసూలయ్యాయి. అంటే వార్షిక లక్ష్యంలో 56.44 శాతం ఇప్పటికే సమకూరింది. అలాగే వ్యాట్, సేల్స్ ట్యాక్స్ ద్వారా రూ.38,106 కోట్ల వార్షిక ఆదాయ లక్ష్యానికి గానూ 7 నెలల్లో రూ.21,893 కోట్లు వచ్చాయి. అంటే లక్ష్యంలో 57.45 శాతం సాధించినట్లు అయ్యింది. అయితే మిగిలిన ఐదు నెలల్లోనూ ఇదే స్థాయిలో వసూళ్లు కొనసాగితేనే వార్షిక బడ్జెట్ లక్ష్యాలను చేరుకునే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

నదీ యాజమాన్య బోర్డుల సమావేశాల వాయిదాల పర్వం - పరిష్కారానికి నోచుకోని కీలక జల సమస్యలు



హైదరాబాద్ కృష్ణా, గోదావరి నదీ యాజమాన్య బోర్డుల సమావేశాలు వాయిదాలకు చిరునామాగా మారాయి. భేటీలు లేకపోవడంతో కీలక జల సమస్యలపై చర్చకు అంతులేని నిరీక్షణ కొనసాగుతోంది. కృష్ణా బోర్డు భేటీ ఆరుసార్లు వాయిదా పడగా, గోదావరి బోర్డులో పరిస్థితి కూడా అదే తీరుగా మారింది.

వాయిదాల వలయంలో సమావేశాలు

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య నదీ జలాల వివాదాలకు పరిష్కారం చూపాల్సిన కృష్ణా, గోదావరి నదీ యాజమాన్య బోర్డుల సమావేశాలు వాయిదాల వలయంలో చిక్కుకున్నాయి. కీలక సమస్యలపై చర్చించాల్సిన భేటీలు పదే పదే వాయిదా పడుతుండటంతో జల వివాదాల పరిష్కారం మరింత ఆలస్యమవుతోంది. కృష్ణా బోర్డు 21వ సమావేశం ఏకంగా ఆరుసార్లు వాయిదా పడగా, గోదావరి బోర్డు సమావేశం కూడా పలుమార్లు వాయిదా పడింది.

పరిష్కారానికి నోచుకోని కీలక సమస్యలు

రెండు రాష్ట్రాల మధ్య నీటి పంపిణీ, ప్రాజెక్టుల నిర్వహణ, టెలిమెట్రీ వ్యవస్థల ఏర్పాటు వంటి కీలక అంశాలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. రెండు రాష్ట్రాల మధ్య నదీ జలాల వివాదాలకు పరిష్కారం చూపాల్సిన వ్యవస్థలే ఇప్పుడు వాయిదాల బాట పట్టాయి. కృష్ణా, గోదావరి నదీ యాజమాన్య బోర్డుల సమావేశాలు నిర్వహించాలనే నిర్ణయాలు వెలువడుతున్నా, ఆచరణలో మాత్రం భేటీలు జరగడం . దీంతో కీలక జల సమస్యలు పరిష్కారానికి నోచుకోలేకపోతున్నాయి.

నారాయణగూడలో సదర్ ఉత్సవ మేళా..

ట్రాఫిక్ ఆంక్షలు!

- నేటి రాత్రి 7 నుంచి రేపు తెల్లవారుజామున 4 గంటల వరకు వాహనాల మళ్లింపు
- వైఎంసీఏ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు.. ప్రత్యామ్నాయ మార్గాలు సూచించిన హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు



హైదరాబాద్ కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో నవంబర్ 9 (పీపుల్స్ న్యూస్)

నారాయణగూడ వైఎంసీఏ వద్ద నిర్వహించనున్న సదర్ ఉత్సవ మేళా సందర్భంగా హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు వాహనదారులకు కీలక సూచనలు జారీ చేశారు. నవంబర్ 10వ తేదీ రాత్రి 7 గంటల నుంచి నవంబర్ 11వ తేదీ ఉదయం 4 గంటల వరకు ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉండనున్నాయి. మేళాకు భారీగా సందర్శకులు వచ్చే అవకాశం ఉండటంతో ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు పలు మార్గాల్లో వాహనాలను దారి మళ్లించనున్నారు.

వాహనాల మళ్లింపు మార్గాలు ఇవే..

1. రాంకోటి, లింగంపల్లి చౌరస్తాల నుంచి వైఎంసీఏ వైపు వెళ్లే వాహనాలను కాచిగూడ చౌరస్తా వద్ద టూరిస్ట్ హోటల్, సుల్తాన్ బజార్ వైపు మళ్లిస్తారు.
2. విఠల్‌వాడి చౌరస్తా నుంచి రాజ్ మొహల్లా చిల్లా వైపు వెళ్లే వాహనాలను పద్మశాలి భవన్ వద్ద రాంకోటి చౌరస్తా వైపు మళ్లిస్తారు.
3. ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్, శ్మశానవాటిక వైపు నుంచి వచ్చే వాహనాలను విఠల్‌వాడి చౌరస్తా వద్ద రాంకోటి వైపు మళ్లిస్తారు.
4. ఆర్టీసీ చౌరస్తా, క్రౌన్ కేఫ్ నుంచి వైఎంసీఏ వైపు వెళ్లే వాహనాలను నారాయణగూడ చౌరస్తా వద్ద హిమాయత్‌నగర్ వై జంక్షన్ వైపు మళ్లిస్తారు.
5. నారాయణగూడ చౌరస్తా నుంచి ఆర్‌బీవీఆర్‌ఆర్ కళాశాల వైపు వెళ్లే వాహనాలను బాబా టెంట్ హౌస్ వద్ద క్రౌన్ కేఫ్ వైపు మళ్లిస్తారు.
6. బాగ్‌లింగంపల్లి కాలనీ సందుల నుంచి వచ్చే వాహనాలను రెడ్డి కళాశాల జంక్షన్ వద్ద బాబా టెంట్ హౌస్ వైపు మళ్లిస్తారు.
7. బర్కత్‌పురా చమన్ నుంచి వైఎంసీఏ వైపు వెళ్లే వాహనాలను పోస్ట్ ఆఫీస్ జంక్షన్ వద్ద క్రౌన్ కేఫ్ వైపు మళ్లిస్తారు.
8. క్రౌన్ కేఫ్ నుంచి లింగంపల్లి చౌరస్తా వైపు వెళ్లే వాహనాలను పోస్ట్ ఆఫీస్ జంక్షన్ వద్ద బర్కత్‌పురా చమన్ వైపు మళ్లిస్తారు.
9. లింగంపల్లి చౌరస్తా, లింగంపల్లి కాలనీ సందుల నుంచి ఆర్‌బీవీఆర్‌ఆర్ కళాశాల వైపు వెళ్లే వాహనాలను మాతా టెంపుల్ వద్ద పోస్ట్ ఆఫీస్ జంక్షన్ వైపు మళ్లిస్తారు.
10. కాచిగూడ చౌరస్తా నుంచి పోస్ట్ ఆఫీస్ జంక్షన్ వైపు వెళ్లే వాహనాలను లింగంపల్లి చౌరస్తా వద్ద బర్కత్‌పురా చమన్ మీదుగా టూరిస్ట్ జంక్షన్ వైపు మళ్లిస్తారు. టూరిస్ట్ జంక్షన్ నుంచి లింగంపల్లి చౌరస్తా వైపు వాహనాలను అనుమతించరు.

ఆర్టీసీ బస్సులకు ప్రత్యేక దారి

సికింద్రాబాద్ నుంచి కోఠి, కోఠి నుంచి సికింద్రాబాద్ వెళ్లే ఆర్టీసీ బస్సులు వైఎంసీఏ సర్కిల్, నారాయణగూడ చౌరస్తా మార్గాలను నివారించాలి. బర్కత్‌పురా, పోస్ట్ ఆఫీస్ జంక్షన్, బాగ్‌లింగంపల్లి, వీఎస్టీ, ఆర్టీసీ చౌరస్తా మీదుగా రాకపోకలు సాగించాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు.

పార్కింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు

సదర్ ఉత్సవ మేళాకు వచ్చే సందర్శకుల వాహనాల పార్కింగ్ కోసం కేశవ్ మెమోరియల్ కళాశాల మైదానాన్ని కేటాయించారు. ఇక్కడ 400 ద్విచక్ర వాహనాలు, 400 నాలుగు చక్రాల వాహనాలను నిలిపే సౌకర్యం కల్పించారు.

ట్రాఫిక్ సహాయానికి హెల్ప్‌లైన్

వాహనదారులు ట్రాఫిక్ మళ్లింపులను గమనించి ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. తాజా సమాచారం కోసం హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసుల ఫేస్‌బుక్ పేజీ ఝఎవఎశీశీఎ.ఎశీఎ/న్ణూ, ఎక్స్ ఖాతా ఏన్ణూను అనుసరించాలని సూచించారు. అత్యవసర ట్రాఫిక్ సహాయం కోసం 9010203626 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.సదర్ ఉత్సవ మేళా ప్రశాంతంగా, ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా నిర్వహించేందుకు నగర ప్రజలు, వాహనదారులు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

ఏఐ సైబర్ దాడులపై అప్రమత్తంగా ఉండాలి!

- బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, క్విక్ కామర్స్ సంస్థలకు సీపీ సజ్జనర్ హెచ్చరిక
- థర్డ్ పార్టీ ఏపీఐల భద్రతపైనా ప్రత్యేక నిఘా.. నిర్లక్ష్యం చేస్తే భారీ మూల్యం తప్పదు!
- సైబర్ నేరగాళ్లకు అడ్డుకట్ట వేసేందుకు పటిష్టమైన భద్రతా వ్యవస్థలు ఏర్పాటు చేసుకోవాలి



హైదరాబాద్ కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో నవంబర్ 9 (పీపుల్స్ న్యూస్)

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతను ఆసరాగా చేసుకుని అంతర్జాతీయ సైబర్ నేరగాళ్లు కొత్త తరహా దాడులకు పాల్పడుతున్న నేపథ్యంలో బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, క్విక్ కామర్స్ సంస్థలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ హెచ్చరించారు. పౌరుల ఆర్థిక లావాదేవీలు, వ్యక్తిగత సమాచారాన్ని భద్రపరిచే సంస్థలు తమ సైబర్ భద్రతా వ్యవస్థలను మరింత బలోపేతం చేసుకోవాలని సూచించారు.ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు ఏఐ ఆధారిత సాధనాలతో ఆర్థిక సంస్థల నెట్‌వర్క్‌లలోని సాంకేతిక లోపాలను గుర్తించి దాడులకు పాల్పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా అప్‌డేట్ చేయని పాత సాఫ్ట్‌వేర్లు, తప్పుడు ఇంటర్నెట్ కాన్ఫిగరేషన్లు, కస్టమర్ ఫిర్యాదుల పోర్టళ్లలోని లోపాలను ఆసరాగా చేసుకుంటున్నారని పేర్కొన్నారు.

థర్డ్ పార్టీ వ్యవస్థలపైనా నిఘా తప్పనిసరి!

అనేక నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు (ఎన్‌బీఎఫ్‌సీలు) వినియోగదారుల వ్యక్తిగత వివరాలు, చెల్లింపుల నిర్వహణ కోసం థర్డ్ పార్టీ మాడ్యూళ్లు, ఏపీఐ సేవలపై ఆధారపడుతున్నాయని సీపీ తెలిపారు. ఈ సహాయక వ్యవస్థలకు కూడా ప్రధాన అప్లికేషన్లతో సమానమైన భద్రత కల్పించాలని స్పష్టం చేశారు.ఆటోమేటెడ్ ఫండ్ డిస్బర్స్‌మెంట్ వ్యవస్థలు, పేమెంట్ ఏపీఐలలోని లోపాలను ఉపయోగించుకుని సైబర్ నేరగాళ్లు భారీ మొత్తాలను మ్యూల్ బ్యాంకు ఖాతాల్లోకి మళ్లించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. డిజిటల్ ఆధారాలను సైతం చెరిపేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

సైబర్ దాడులను అడ్డుకునేందుకు కీలక సూచనలు.

- వినియోగంలో లేని పాత ఏపీఐలను వెంటనే తొలగించాలి.
- సంస్థల్లో ఉపయోగించే సాఫ్ట్‌వేర్లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలి.
- కస్టమర్ పోర్టళ్ల భద్రతను ప్రతిరోజూ సమీక్షించాలి.
- అసాధారణ వేగంతో జరిగే భారీ లావాదేవీలను గుర్తించే ప్రత్యేక వ్యవస్థలు ఏర్పాటు చేయాలి.
- నగదు విడుదలకు ముందు లబ్ధిదారుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.
- పూర్తిస్థాయి కేవైసీ ప్రక్రియను తప్పనిసరిగా అమలు చేయాలి.
- కీలక ఆర్థిక లావాదేవీలకు ఉన్నతాధికారుల అనుమతి ఉండాలి.
- ఐటీ, సైబర్ భద్రతా విభాగాలు సమన్వయంతో పనిచేయాలి.
- సైబర్ దాడులను ఎదుర్కొనేందుకు తరచూ రెడ్ టీమ్ మాక్ డ్రిల్స్ నిర్వహించాలి.

ప్రజల ఆర్థిక భద్రతే ప్రధాన లక్ష్యం.

డిజిటల్ వ్యవస్థల్లో చిన్నపాటి భద్రతా లోపం కూడా భారీ ఆర్థిక నష్టాలకు దారితీసే ప్రమాదం ఉందని సీపీ సజ్జనర్ పేర్కొన్నారు. అందువల్ల సంస్థలు ముందస్తు నివారణ చర్యలకు ప్రాధాన్యత ఇవ్వాలని, నిపుణులైన సైబర్ భద్రతా సిబ్బందిని అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.ప్రజలు ఎవరైనా అనుమానాస్పద లావాదేవీలను గుర్తించినా, సైబర్ మోసానికి గురైనా ఆలస్యం చేయకుండా వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కు ఫోన్ చేయాలని లేదా ఎఎఎవతీఎతీఅఎవ.స్త్రశీఙ.అఅ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సీపీ విజ్ఞప్తి చేశారు.

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి.





వనపర్తి బ్యూరో నవంబర్ 9

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులు, వినతులను అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ అధికారులను ఆదేశించారు.వనపర్తి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన జిల్లాస్థాయి ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ ప్రజల నుంచి అర్జీలు, వినతిపత్రాలు స్వీకరించారు.ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేస్తూ.. ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించి, తీసుకున్న చర్యల వివరాలను సంబంధిత ఫిర్యాదుదారులకు తెలియజేయడంతో పాటు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు.తమ శాఖ పరిధిలో లేని ఫిర్యాదులను సంబంధిత శాఖలకు లేఖ ద్వారా పంపించాలని తెలిపారు.పరిష్కరించలేని అంశాలుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని లేదా నిబంధనల ప్రకారం ఎందుకు పరిష్కరించలేకపోతున్నారో ఫిర్యాదుదారులకు స్పష్టంగా తెలియజేయాలని పేర్కొన్నారు. అర్జీలను తమ వద్ద పెండింగ్‌లో ఉంచుకోవద్దని ఆదేశించారు.అలాగే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి, జిల్లా మంత్రి ప్రజావాణి ద్వారా వచ్చిన పెండింగ్ అర్జీలను సైతం ప్రాధాన్యతతో పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు.సోమవారం నిర్వహించిన జిల్లా ప్రజావాణిలో మొత్తం 18 దరఖాస్తులు రాగా, ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఒక దరఖాస్తు అందింది.ఈ కార్యక్రమంలో డీఆర్ఓ రామ్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ యాదయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిరుపతయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బేగంబజార్‌లో భారీ జూద స్థావరంపై గోషామహల్ పోలీసుల దాడి

- 16 మంది అరెస్ట్.. మరో 12 మంది పరారీ!
- రూ.23,800 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, పేకాట ముక్కలు స్వాధీనం



హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో నవంబర్ 9 (పీపుల్స్ న్యూస్)
నగరంలో అక్రమ జూద కార్యకలాపాలపై గోషామహల్ పోలీసులు కొరడా ఝుళిపించారు. బేగంబజార్‌లోని ఫిష్ మార్కెట్ సమీపంలో నిర్వహిస్తున్న భారీ పేకాట స్థావరంపై అర్ధరాత్రి మెరుపు దాడి నిర్వహించి 16 మందిని అరెస్ట్ చేయగా, మరో 12 మంది పరారయ్యారు. గోషామహల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బేగంబజార్ ఫిష్ మార్కెట్ వద్ద ఉన్న ధనలక్ష్మి ఫిష్ గోదాంలో అక్రమంగా అందర్-బాహర్, తీన్‌పత్తి పేకాట నిర్వహిస్తున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో నవంబర్ 8వ తేదీ అర్ధరాత్రి 12.20 గంటల సమయంలో పోలీసులు దాడి నిర్వహించారు. రెండు పక్కపక్క గదుల్లో నగదు పందాలతో పేకాట ఆడుతున్న 16 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై గోషామహల్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 419/2026గా తెలంగాణ గేమింగ్ యాక్ట్ సెక్షన్లు 3, 4 మరియు బీఎన్ఎస్ సెక్షన్ 112(2) కింద కేసు నమోదు చేశారు.

పోలీసుల అదుపులో 16 మంది.
పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో గుల్షన్ సింగ్, అంకిత్ సింగ్, విజయ్ రాజ్ సింగ్, వికాస్ బిరాదార్, గాడేకర్ అనిల్, అక్షిత్ సింగ్, అంకిత్, కరణ్ సోంకర్, హరి ఓం, ప్రీతమ్, మనీష్, భాను, ప్రకాష్, అంకిత్ కుమార్, సందీప్ నిషాగ్, ప్రేమ్ శంకర్ ఉన్నారు. మరో 12 మంది నిందితులు అడప్ప, అర్జున్ సింగ్, అభిషేక్, అజయ్, దినేష్, మిథున్, అశుతోష్, ధీరజ్, కార్తీక్ సింగ్, వికాస్ సింగ్, విశాల్ సింగ్, అర్జున్ సింగ్ పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

నగదు, మొబైల్ ఫోన్లు స్వాధీనం.
దాడి సందర్భంగా పేకాట పందాలకు ఉపయోగిస్తున్న రూ.23,800 నగదుతో పాటు మూడు సెట్ల పేకాట ముక్కలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఐఫోన్ 15 ప్రో మ్యాక్స్, వివోకు చెందిన మూడు మొబైల్ ఫోన్లను జప్తు చేశారు.

పరారీలో ఉన్న వారి కోసం గాలింపు.
పరారీలో ఉన్న మరో 12 మంది నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్లు గోషామహల్ పోలీసులు తెలిపారు. అక్రమ జూద కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
వ్యాపార సముదాయాలు, గోదాముల యజమానులు తమ ప్రాంగణాలను అక్రమ కార్యకలాపాలకు వేదికలుగా మారనివ్వకూడదని పోలీసులు సూచించారు. జూదం లేదా ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాల సమాచారం తెలిస్తే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు లేదా 100/112 నంబర్లకు తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ వివరాలను గోషామహల్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బి. శ్రావణ్ కుమార్ వెల్లడించారు.

కత్తితో దాడి చేసి సెల్‌ఫోన్ల దోపిడీ!

- దుర్గం చెరువు మెట్రో స్టేషన్ సమీపంలో బీభత్సం.. ఇద్దరు నిందితుల అరెస్ట్
- రెండు దోపిడీ కేసులను ఛేదించిన మాదాపూర్ పోలీసులు.. కత్తి, రెండు చోరీ ఫోన్లు స్వాధీనం



సైబరాబాద్ కమిషనరేట్: క్రైమ్ బ్యూరో నవంబర్ 9 (పీపుల్స్ న్యూస్)
ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని సెల్‌ఫోన్లు దోపిడీ చేస్తున్న ఇద్దరు యువకులను మాదాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. సెల్‌ఫోన్ లాక్కునే ప్రయత్నాన్ని బాధితుడు ప్రతిఘటించడంతో కత్తితో భుజంపై దాడి చేసి రక్తగాయాలు చేసిన నిందితులు, అతని వివో సెల్‌ఫోన్‌ను బలవంతంగా లాక్కొని పరారయ్యారు. ఇదే తరహాలో మరో వ్యక్తి నుంచి రెడ్‌మీ ఫోన్‌ను కూడా దోచుకున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.

దోపిడీకి పాల్పడిన విధానం.
దుర్గం చెరువు మెట్రో స్టేషన్ సమీపంలో ఒంటరిగా వెళ్తున్న ఫిర్యాదుదారుడిని ఇద్దరు నిందితులు అడ్డగించి సెల్‌ఫోన్ లాక్కునేందుకు ప్రయత్నించారు. బాధితుడు ప్రతిఘటించడంతో వారిలో ఒకరు కత్తితో భుజంపై దాడి చేశారు. అనంతరం వివో మొబైల్ ఫోన్‌ను బలవంతంగా లాక్కొని అక్కడి నుంచి పారిపోయారు. ఇదే పద్ధతిలో మరో దోపిడీకి పాల్పడి రెడ్‌మీ ఫోన్‌ను అపహరించారు.

నిందితుల వివరాలు.
1. వనగండ్ల నరేష్ (19), తండ్రి నర్సయ్య, వృత్తి కూలీ, అంబేద్కర్ కాలనీ, జూబ్లీహిల్స్ నివాసి.
2. కుర్మ నవీన్ (19), తండ్రి నారాయణ, మస్తాన్ నగర్, మాదాపూర్ నివాసి.

అయ్యప్ప సొసైటీలో పట్టివేత.
అయ్యప్ప సొసైటీ, మాదాపూర్ ప్రాంతంలో నిందితులు సంచరిస్తుండగా క్రైమ్ బృందం గుర్తించింది. పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించినప్పటికీ వారిని పట్టుకున్నారు. విచారణలో నిందితుల నేర అంగీకారం మేరకు రెండు చోరీ సెల్ ఫోన్లు, దోపిడీకి ఉపయోగించిన కత్తిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

రెండు కేసులు ఛేదింపు.
మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన క్రైమ్ నంబర్లు 1765/2026, 1766/2026 కేసులను పోలీసులు ఛేదించారు. బీఎన్ఎస్ సెక్షన్లు 309(6), 109 రెడ్‌విత్ 3(5) కింద కేసులు నమోదయ్యాయి. నేరాలను ఛేదించి నిందితులను పట్టుకోవడంలో సమర్థవంతంగా పనిచేసిన మాదాపూర్ పోలీస్ క్రైమ్ టీమ్‌ను ఉన్నతాధికారులు అభినందించారు. ఈ వివరాలను మాదాపూర్ డివిజన్ ఏసీపీ వెల్లడించారు.

డివైడర్‌ను ఢీకొన్న సియాజ్ కారు..

డ్రైవర్‌కు తీవ్ర గాయాలు!

- జీడిమెట్ల హెచ్ఎంటీ యూటర్న్ వద్ద ప్రమాదం
- నిర్లక్ష్యంగా, ప్రమాదకరంగా కారు నడపడంతోనే ప్రమాదం.. కేసు నమోదు





సైబరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో నవంబర్ 9 (పీపుల్స్ న్యూస్)
నిర్లక్ష్యంగా, ప్రమాదకరంగా కారు నడిపి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మజార్ ఖాన్ అనే వ్యక్తి నవంబర్ 7, 2026న దుండిగల్ నుంచి బాలానగర్‌కు సియాజ్ కారులో వెళ్తుండగా జీడిమెట్లలోని హెచ్ఎంటీ యూటర్న్ వద్ద కారు అదుపుతప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతని తలకు బలమైన గాయం అయినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, మజార్ ఖాన్‌పై జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్ ఉన్నట్లు పోలీసుల సమాచారం. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

ఎర్రకోటపై ఉగ్రదాడి- ఒక్క ఏడాదిలో 300పైగా ఉగ్రవాదులు అరెస్టు



దిల్లీ: దేశ రాజధాని దిల్లీలో ఎర్రకోట పేలుడు జరిగి ఓ ఏడాది గడిచిన నేపథ్యంలో కేంద్ర భద్రతా సంస్థలు దేశవ్యాప్తంగా నిఘాను కట్టుదిట్టం చేశాయి. భవిష్యత్తులో ఇలాంటి దాడులను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటోంది. గడిచిన ఏడాది కాలంలో సరిహద్దు అవతల నుంచి సాగుతున్న ఉగ్రవాద నెట్‌వర్క్‌లపై భద్రతా దళాలు భారీ దాడులు జరిపాయి. వీటిల్లో 300 మందికి పైగా ఉగ్రవాద ఆపరేటివ్‌లను అరెస్ట్ చేయగా, విదేశాల్లో తలదాచుకున్న 73 మంది మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదులను భారతదేశానికి రప్పించారు. ఎర్రకోట పేలుడుతో ఇలాంటి దాడులను నివారించడానికి కేంద్ర నిఘా సంస్థలు ఒక విధానాన్ని రూపొందించాయి. ఈ ఆలోచనతోనే ఫిబ్రవరి 23న 'ప్రహార్: జాతీయ ఉగ్రవాద నిరోధక విధానం, వ్యూహం' (ూ=ూనూూూ=: చీఘ్అశీఝశ్రీ జు ూశీశ్రీఅఎఎ ఘఅఎ ూతీఘ్వస్త్రఎ) విధానాన్ని ప్రవేశపెట్టింది. ఉగ్రవాదం పట్ల జీరో టాలరెన్స్? విధానాన్ని ఉంటుందని 2026 సెప్టెంబర్?లో జరిగిన రాష్ట్ర డీజీపీలు, కేంద్ర ఏజెన్సీ అధిపతుల ఉన్నత స్థాయి సమావేశంలో స్పష్టం చేసింది. ఈ 'ప్రహార్' వ్యూహంలో భాగంగానే పాకిస్థాన్ ఐఎస్ఐ (ఱూ×) మద్దతు ఉన్న 'షహజాద్ భట్టి నెట్‌వర్క్' (ూదీచీ) పై దేశవ్యాప్తంగా దాడులు చేసి 100కు పైగా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. దాదాపు 300 మందికి పైగా కార్యకర్తలను అరెస్టు చేశారు. ఇంప్రొవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజ్‌లు (×జుణలు), పాకిస్థాన్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ గుర్తులు ఉన్న హ్యాండ్ గ్రెనేడ్‌లు, అక్రమ ఆయుధాలను స్వాధీనం చేసుకున్నాయి. అనంతరం సెప్టెంబర్ 26న చట్టవ్యతిరేక కార్యకలాపాల (నివారణ) చట్టం (ఖూూూ) కింద ఎస్‌బీఎన్ (ూదీచీ) ను ఉగ్రవాద సంస్థగా కేంద్రం ప్రకటించింది. విదేశాల నుంచి 73 మంది డిపోర్టేషన్‌అటు ఉగ్రవాదులకు విదేశీ ఆశ్రయాలు లభించకుండా దౌత్యపరమైన చర్యలను కేంద్రం వేగవంతం చేసింది. ఇందులో భాగంగా ఈ ఏడాది సెప్టెంబర్‌లో ప్రత్యేక 'ఎక్స్‌ట్రాడిషన్ పోర్టల్'ను ప్రారంభించింది. దీనివల్ల గడిచిన ఏడాది కాలంలో విదేశాల నుంచి 73 మంది కీలక ఉగ్రవాదులను భారత్‌కు రప్పించగలిగారు. మరోవైపు బాంబుల తయారీకి వాడే అమ్మోనియం నైట్రేట్ అమ్మకాలపై ఇప్పుడు ఆకస్మిక తనిఖీలు నిరంతరం జరుగుతున్నాయని అధికార వర్గాలు వెల్లడించాయి. యువతలో వచ్చే ఉగ్ర ఆలోచనల ప్రవర్తన మార్పులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపాయి. "ఎర్రకోట పేలుడు కేసు ప్రత్యేకమైనది. ఎందుకంటే ఇందులో అత్యంత అర్హత కలిగిన నిపుణులు పాలుపంచుకున్నారు. ఇప్పుడు అమ్మోనియం నైట్రేట్, ఇతర పదార్థాల అమ్మకాలపై ఎప్పటికప్పుడు ఆకస్మిక తనిఖీలతో సహా అనేక నిబంధనలు అమల్లో ఉన్నాయి." అని ఓ అధికారి తెలిపారు. అదే సమయంలో కేంద్ర భద్రతా సంస్థలు అనేక ఆపరేషన్లు చేపట్టి తీవ్రవాద మాడ్యూళ్లను విజయవంతంగా నిర్మూలించాయి. జైష్-ఎ-మొహమ్మద్ (జీవవీ), లష్కర్-ఎ-తైబా (ూమ) వంటి నిషేధిత సంస్థల మద్దతు వ్యవస్థలను దెబ్బతీశాయి. ఖలిస్థాన్? అనుకూల శక్తుల (ూఖజు)పై తీసుకున్న చర్యలు, బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్, ఖలిస్థాన్ జిందాబాద్ ఫోర్స్ వంటి సంస్థల నెట్‌వర్క్ వ్యూహాలను నిర్వీర్యం చేశాయి. దీనివల్ల సరిహద్దుల గుండా జరిగే ఆయుధాల స్మగ్లింగ్‌కు అంతరాయం కలగడంతో పాటు, కీలకమైన వ్యక్తులను అరెస్టు చేశాయి. బంగ్లాదేశ్ కేంద్రంగా ఉన్న ఉగ్రవాద ముప్పుల నివారణను కూడా ముమ్మరం చేశాయి. అసోం, బంగాల్, త్రిపుర, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో జమాత్-ఉల్-ముజాహిదీన్ బంగ్లాదేశ్ (జీవీదీ) భావజాలంతో ప్రేరణ పొందిన 27 మంది తీవ్రవాద కార్యకర్తలను అరెస్టు చేశాయి. 2025 నవంబరు 10న దిల్లీలోని చారిత్రక ఎర్రకోట వద్ద కారు బాంబు పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 11 మంది మృతి చెందారు. ఈ కేసులో ఎన్ఐఏ (చీ×ూ) 7500 పేజీల ఛార్జ్‌షీట్‌ను దిల్లీ కోర్టుకు సమర్పించింది. ప్రధాన సూత్రధారి ఉమర్ ఉన్ నబీతో (పేలుడులో అతడు మరణించాడు) పాటు మొత్తం 10 మందిని నిందితులుగా చేర్చింది. దర్యాప్తులో భాగంగా జమ్మూకశ్మీర్, హరియాణా, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, దిల్లీలో ఎన్ఐఏ సోదాలు జరిపి 588 మంది నుంచి వాంగ్మూలాలు నమోదు చేసింది. 395కు పైగా పత్రాలు, 200కు పైగా స్వాధీనం చేసుకున్న పరికరాల నుంచి సాక్ష్యాలు సేకరించినట్లు ఛార్జ్‌షీట్‌లో పేర్కొంది. ఈ పేలుడు వెనుక జిహాదీ కుట్ర కోణం ఉన్నట్లు ఫోరెన్సిక్, సాంకేతిక ఆధారాలు స్పష్టంచేశాయని దర్యాప్తు సంస్థ వెల్లడించింది. ఈ కేసులో ఇప్పటివరకు మొత్తం 11 మందిని అరెస్ట్ చేసింది.

500ఏళ్ల నాటి కాళీ పూజ- తుపాన్లు?, కరోనా వచ్చినా ఆగని ఆరాధన- భుజాలపై మోస్తూ అమ్మవారికి వీడ్కోలు!



ఒడిశాలోని కటక్ విద్యాధరపుర్ ప్రాంతంలో 500 ఏళ్లుగా కాళీ పూజ వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. తుపాన్లు, కరోనా వంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా ఇక్కడి ప్రజలు మాత్రం వేడుకలను విజయవంతంగా పూర్తిచేస్తున్నారు. తమ పూర్వీకుల నాటి ఆచారాలను ఏమాత్రం విస్మరించకుండా శతాబ్దాలుగా ఈ పూజలను కొనసాగిస్తున్నారు.
సుమారు క్రీ.శ. 1500 ప్రాంతంలో బంగాల్‌కు చెందిన కొన్ని కుటుంబాలు శ్రీ చైతన్య దేవునితో కలిసి ఒడిశాకు వచ్చి కటక్‌లోని విద్యాధర్‌పూర్ ప్రాంతానికి వచ్చి స్థిరపడ్డాయి. వారు తమతో పాటు ఒక 'ఘటం' (పవిత్ర కలశం), ఒక 'ఖడ్గం', ఇంకా కాళీ మాతకు సంబంధించిన ఇత్తడి విగ్రహాన్ని తీసుకువచ్చి పూజలు చేయడం ప్రారంభించారు. అయితే, కాలక్రమేణా మట్టి విగ్రహాలను తయారు చేసి అమ్మవారిని పూజించే సంప్రదాయం మొదలైంది. ఇక్కడ రెండు వేర్వేరు మంటపాల్లో 'పెద్ద కాళీ' (బడో కాళీ), 'చిన్న కాళీ' (సానో కాళీ) రూపాల్లో అమ్మవార్లను పూజిస్తారు. దివంగత బిశ్వేశ్వర్ ఛటర్జీ విద్యాధర్‌పూర్‌లో 'బడ కాళీ' (పెద్ద కాళీ) ఆరాధనను మొదట ప్రారంభించారు.
అయితే, కటక్? కాళీ పూజకు సంబంధించిన మరో కథ సైతం ప్రచారంలో ఉంది. "బంగాల్‌కు చెందిన ఒక వ్యక్తి కలకత్తాలో గంగా నదిని దాటుతుండగా ఆయన ప్రయాణిస్తున్న స్టీమర్ (నౌక) ప్రమాదానికి గురైంది. అయితే, నీటిలో మునిగిపోతున్న తరుణంలో 'మా గంగా- కాళీ'ని స్మరించుకున్నాడు. 'తల్లి నన్ను కాపాడితే నా స్వగ్రామం విద్యాధర్‌పుర్‌కు వెళ్లి అక్కడ కాళీ మాత విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజిస్తాను.' అని మొక్కుకున్నాడు. అప్పటి నుంచి 'బడా కాళి' (పెద్ద కాళి), 'సానా కాళి' (చిన్న కాళి) అని పిలిచే రెండు వేర్వేరు మండపాల్లో మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజిస్తున్నారు." అని మరో కథ ప్రచారంలో ఉంది. ఇంకా ఇక్కడ పూజించే రెండు కాళీ విగ్రహాలు చూడటానికి భిన్నంగా ఉంటాయి. 'బడా కాళి' విగ్రహానికి పళ్లు కనిపించవు. కానీ రక్తపు చారలు కనిపిస్తాయి. అదే సమయంలో 'సానా కాళి' విగ్రహానికి పళ్లు స్పష్టంగా కనిపించినా శరీరంపై రక్తపు మరకలు ఉంటాయి. ఈ రెండు విగ్రహాలకు ప్రతీకాత్మక బలిగా బూడిద గుమ్మడికాయలను సమర్పిస్తారు. నాలుగో రోజున 'అపరాజిత' పూజ అనంతరం 'ఘటం' (పవిత్రమైన పూజా కలశం)ను నిమజ్జనం చేస్తారు. విద్యాధర్‌పుర్‌లో జరిగే కాళీ పూజ ఎంతో ప్రత్యేకమైనది. సాధారణంగా ఇతర ప్రాంతాల్లో కాళీ పూజ రాత్రిపూట జరిగి, ఆ తర్వాత వెంటనే మరుసటి రోజు విగ్రహాన్ని నిమజ్జనం చేస్తారు. కానీ ఇక్కడ మాత్రం అమ్మవారిని నాలుగు రోజుల పాటు 'షోడశోపచార' (పదహారు రకాల సాంప్రదాయ పూజా కార్యక్రమాలు)లతో అత్యంత వైభవంగా పూజిస్తారు. అమ్మవారికి అన్న భోగం, హారతి, పుష్పాంజలి సమర్పిస్తారు. పూర్వం ఇక్కడ జంతు బలి ఇచ్చేవారు. అయితే, ప్రభుత్వ నిబంధనల మేరకు అటువంటి ఆచారాలను నిషేధించడంతో ఇప్పుడు మొక్కులు చెల్లించుకునే భక్తులు ఒక మేకను అమ్మవారికి సమర్పించి, ఆ తర్వాత దానిని బలి ఇవ్వకుండా తిరిగి వదిలివేస్తున్నారు. ప్రస్తుతం కేవలం గుమ్మడికాయలను బలిగా ఇస్తున్నారు.

కాంగ్రెస్, బీజేపీలకు షాక్..

- టీఆర్ఎస్ లోకి నేతల చేరికలు
- కవిత పాంచజన్య సిద్ధాంతాలు, సామాజిక న్యాయం నినాదానికి ఆకర్షితులై పార్టీలో చేరిన పలువురు నాయకులు



గజ్వేల్, /

తెలంగాణ రక్షణ సేనలోకి కాంగ్రెస్, బీజేపీలకు చెందిన నాయ కులు చేరడం గజ్వేల్ రాజకీయాల్లో ఆసక్తి కరంగా మారింది. ఆయా పార్టీలకు చెందిన పలువురు నాయకులు తమ పార్టీలను వీడి సోమవారం తెలంగాణ రక్షణ సేనలో చేరారు. కుకునూరుపల్లి మండలం లక్ష్మారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఉపసర్పంచ్ కంకణాల మల్లేశం, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు అష్రాఫ్, గజ్వేల్ ప్రజ్ఞా పూర్ మున్సిపాలిటీ ఏడో వార్డుకు చెందిన మున్ను, నాలుగో వార్డుకు చెందిన బీజేపీ సీని యర్ నాయకురాలు శైలజ తెలంగాణ రక్షణ సేనలో చేరారు. తెలంగాణ రక్షణ సేన గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొట్టాల యాదగిరి సమ క్షంలో పార్టీలో చేరిన వారికి ఆయన కండు వాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కొట్టాల యాదగిరి మాట్లాడుతూ తెలంగాణలో ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతుకగా తెలంగాణ రక్షణ సేన నిలుస్తోం దని, ప్రజలు ఈ విషయాన్ని గుర్తిస్తు న్నారని అన్నారు. పార్టీలో చేరిన నాయకులు మాట్లా డుతూ తెలంగాణ రక్షణ సేన వ్యవస్థా పకు రాలు కల్వకుంట్ల కవిత ప్రతిపాదించిన పాంచజన్య సిద్ధాంతాలు, సామాజిక న్యాయం, బహుజన తెలంగాణ సాధన లక్ష్యాలు తమను ఆకర్షించాయని తెలిపారు. సామాజిక న్యాయం కోసం తమ వంతు పాత్ర పోషించాలనే సంకల్పంతో పార్టీలో చేరినట్లు పేర్కొన్నారు. ఈ చేరికలతో గజ్వేల్ నియోజకవర్గంలో తెలంగాణ రక్షణ సేనకు మరింత బలం చేకూరుతుందని పార్టీ నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఎడ్ల నర్సింలు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు లింగని రాజు, లీగల్ సెల్ అధ్యక్షుడు నరేష్ చారి, పాషా, లక్ష్మణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించేలా కృషి: ఎమ్మెల్యే గాంధీ



శేరిలింగంపల్లి న్యూస్ : రైల్వే విస్తరణ పనుల్లో గుడిసెలు కోల్పోతున్న ఓల్డ్ ఎంఐజీ కాలనీ పేద కుటుంబాలకు అండగా ఉంటామని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ హామీ ఇచ్చారు. భారతి నగర్ డివిజన్ పరిధిలోని ఈ కాలనీలో సుమారు 40 ఏళ్లుగా నివసిస్తున్న బాధిత కుటుంబాలకు ప్రత్యా మ్నాయ నివాసం కల్పించాలని కోరుతూ తాజా మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, మాజీ కౌన్సిలర్ మోహన్ గౌడ్, సీనియర్ నాయకుడు ఆదర్శ్ రెడ్డి ఆధ్వర్యంలో బాధితులు గాంధీని కలిసి వినతిపత్రం అందజేశారు. అర్హులైన కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు కేటా యించేలా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరి ష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గాంధీ తెలి పారు. ఈ కార్యక్రమంలో భాస్కర్ ముదిరాజ్, బాధిత కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గాంధీకి రాగం నాగేందర్ యాదవ్ దీపావళి శుభాకాంక్షలు



శేరిలింగంపల్లి న్యూస్ : దీపావళి సందర్భంగా ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని శేరిలింగంపల్లి తాజా మాజీ కార్పొ రేటర్ రాగం నాగేందర్ యాదవ్ మర్యా ద్‌పూర్వకంగా కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. చెడుపై మంచి విజయానికి ప్రతీకగా దీపావళిని జరుపు కుంటామని పేర్కొన్నారు. ప్రజలు టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్తలు పాటిస్తూ, ప్రశాం తంగా పండుగ జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మోహన్ గౌడ్, నాయకులు రఘునాథ్ రెడ్డి, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సైబరాబాద్ ప్రజావాణికి 26 ఫిర్యాదులు..



శేరిలింగంపల్లి న్యూస్ : సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జవీజ) ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహి ంచిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి మొత్తం 26 ఫిర్యాదులు అందాయి. ఈ కార్య్ కమంలో సీఎంసీ కమిషనర్‌తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొ న్నారు. కమిషనర్ సృజన ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, ఫిర్యాదులను స్వయ ంగా ఆలకించారు.వివిధ శాఖలకు సంబంది ంచి అందిన ఫిర్యాదుల్లో టౌన్ ప్లానింగ్ విభా గానికి అత్యధికంగా 18, ఇంజినీరింగ్‌కు 4, రెవెన్యూకు 2, లేక్స్ విభాగానికి ఒకటి, ట్రేడ్ లైసెన్స్ విభాగానికి ఒక ఫిర్యాదు వచ్చాయి. ప్రతి ఫిర్యాదును ప్రత్యేక గుర్తింపు సంఖ్య ట్రాకింగ్ లింక్‌తో నమోదు చేశారు. దీంతో ఫిర్యాదుల పరిష్కారంలో పారదర్శకత పెరగడంతో పాటు, తమ సమస్యల పరిష్కార స్థితిని ప్రజలు స్వయంగా తెలుసుకునే అవ కాశం కల్పించారు.ఈ సందర్భంగా కమిషనర్ జి.సృజన మాట్లాడుతూ.. ప్రజల నుంచి అం దిన ప్రతి ఫిర్యాదును సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. సమస్యల స్వభావాన్ని బట్టి అవసరమైన చర్యలు చేపట్టి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులకు అన్ని శాఖలు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, జాప్యం లేకుండా పరిష్కారం చూపడంతో పాటు ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించాలని అధికారులకు సూచించారు.

నా పేరు ప్రఖ్యాతులకు భంగం కలిగిస్తే ఊరుకునేది లేదు!

- పదేళ్ల క్రితం భూ వ్యవహారాన్ని ఇప్పుడు తెరపైకి తెస్తూ బురదజల్లే ప్రయత్నం
- ఆరోపణలు నిరాధారం.. అవసరమైతే పరువునష్టం దావా వేస్తా: ప్రగతి డెవలపర్స్ యజమాని కల్లయ్య స్వామి



హైదరాబాద్, నవంబర్ 9 (పీపుల్స్ న్యూస్)

తన పేరు ప్రతిష్ఠలను దెబ్బతీసేలా కొందరు కావాలనే తప్పుడు ప్రచారానికి పాల్పడుతున్నారని ప్రగతి డెవలపర్స్ యజమాని కల్లయ్య స్వామి ఆరోపించారు. పది సంవత్సరాల క్రితం జరిగిన భూ లావాదేవీలను ఇప్పుడు తెరపైకి తీసుకొచ్చి తనపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఓ ప్రకటనలో మండిపడ్డారు. తాను సుమారు 25 సంవత్సరాలుగా కష్టపడి సంపాదించుకున్న గౌరవాన్ని దెబ్బతీయడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. జల్పల్లికి చెందిన గౌర కుటుంబీకులు బాలయ్య, కొమురయ్య, శివరాజ్, నారాయణ్, రాములు, శంకర్‌లకు 2016లో రూ.1.40 కోట్లను చెల్లించి, సంబంధిత భూములను నేరుగా వినియోగదారులకు విక్రయించినట్లు పేర్కొన్నారు.



అప్పటి నుంచి ఇప్పటివరకు తమ మధ్య ఎలాంటి ఆర్థిక లావాదేవీలు లేవని స్పష్టం చేశారు.కొద్ది రోజుల క్రితం రాములు అనే వ్యక్తి తనకు ఫోన్ చేసి మాట్లాడాలని కోరినట్లు, ప్లాట్లకు సంబంధించిన ఏదైనా విషయం ఉంటుందని భావించానని తెలిపారు. అయితే తాను ఇంట్లో, కార్యాలయంలో లేని సమయంలో కొందరిని వెంటబెట్టుకుని వచ్చి మీడియాకు తప్పుడు సమాచారం అందిస్తూ తన ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నం చేశారని ఆరోపించారు.తాను డబ్బులు బాకీ ఉండి ఉంటే 2016 నుంచి ఇప్పటివరకు ఎందుకు పోలీసులకు ఫిర్యాదు చేయలేదని ప్రశ్నించారు. రాజకీయ నాయకుల అండదండలతో పేదలను ఇబ్బంది పెడుతున్నానంటూ చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని ఖండించారు. తనపై తప్పుడు ప్రచారం కొనసాగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు పరువునష్టం దావా వేస్తానని హెచ్చరించారు.

లావాదేవీలకు నేనే సాక్ష్యం: మనీష్ సింగ్.

జల్పల్లి సర్వే నంబర్ 16లో అభివృద్ధి చేసిన మల్లికార్జున కాలనీ భూ వ్యవహారానికి సంబంధించి కల్లయ్య స్వామి చట్టబద్ధంగానే లావాదేవీలు పూర్తి చేశారని ఆయన మిత్రుడు ధూల్‌పేట్‌కు చెందిన మనీష్ సింగ్ తెలిపారు. సంబంధిత వ్యక్తులకు డబ్బులు చెల్లించి లీగల్‌గా పనులు పూర్తి చేసుకున్నారని, ఈ వ్యవహారానికి తానే సాక్షినని పేర్కొన్నారు.కేవలం కల్లయ్య స్వామి పేరు ప్రతిష్ఠలను దెబ్బతీయాలనే ఉద్దేశంతోనే కొందరు ఈ వివాదాన్ని తెరపైకి తీసుకొస్తున్నారని మనీష్ సింగ్ ఆరోపించారు.ఏదైనా సమస్య ఉంటే చట్టపరమైన మార్గాల్లో పరిష్కరించుకోవాలని, వ్యక్తిగత ప్రతిష్ఠను దెబ్బతీసేలా తప్పుడు ప్రచారాలు చేయవద్దని కల్లయ్య స్వామి సూచించారు. తనపై నిరాధార ఆరోపణలు చేస్తే చట్టపరంగా ఎదుర్కొంటానని స్పష్టం చేశారు.

ఆర్టీసీ కార్మికుల పట్ల సిద్దిపేట డీఎం తీరుపై కార్మిక సంఘాల ఆగ్రహం

- కార్మిక నాయకులను అవమానించేలా వ్యవహరించారని ఆరోపణ
- సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, /

ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు, సమస్యలను విన్నవించేందుకు వచ్చిన కార్మిక సంఘాల నాయకుల పట్ల అమర్యాదగా వ్యవహ రిస్తున్నారని సిద్దిపేట, దుబ్బాక ఆర్టీసీ కార్మిక సంఘాల నాయకులు ఆరోపించారు. సిద్దిపేట డిపో మేనేజర్ (డీఎం) వ్యవహారశైలిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో టీఎంయూ ప్రాంతీయ కార్యదర్శి రవీందర్ గౌడ్, ప్రాంతీయ అధ్యక్షుడు మల్లేశం మాట్లాడుతూ దుబ్బాక ఆర్టీసీ కార్మికుల సమస్యలను డీఎం దృష్టికి తీసుకెళ్లేందుకు వెళ్లిన తమకు కనీస మర్యాద కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కూర్చోవడానికి కుర్చీలు లేవా అని ప్రశ్నించగా కార్మి కులను కూర్చోబెట్టే ఉత్తర్వులు ఇంకా రాలేదంటూ డీఎం వెటకారంగా సమాధానం ఇచ్చారని ఆరోపించారు. రెండు రోజుల క్రితం సిద్దిపేట ఆర్టీసీ డిపోకు వెళ్లిన సందర్భంలోనూ కార్మిక సంఘాల నాయకులను కింద కూర్చోబెట్టి మాట్లాడారని తెలిపారు. ఈ ఘటనపై సంగారెడ్డి ప్రాంతీయ మేనేజర్ సమగ్ర విచారణ చేపట్టకుండానే డీఎంకు క్లీన్‌చిట్ ఇస్తూ ప్రధాన కార్యాలయానికి నివేదిక పంపడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఘటనపై నిష్పక్ష పాతంగా విచారణ జరిపించాలని, వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికుల ఆత్మగౌరవం, హక్కులు, సంక్షేమం కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఈయూ డిపో కార్యదర్శి డివై రెడ్డి, ప్రాంతీయ సహాయ కార్యదర్శి లాల్, టీఎంయూ నాయకుడు బాలూ, ఎన్ఎంయూ డిపో కార్యదర్శి యెల్లయ్య, నాయకులు రంగయ్య, కంకయ్య, నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పాత స్నేహానికి సేవాభావం తోడు.. వృద్ధులకు అండగా పదో తరగతి మిత్రులు!

- ప్రేమ సదన్ వృద్ధాశ్రమానికి దుప్పట్లు, బెడ్‌షీట్లు, దిండ్లు పంపిణీ



జనగామ జిల్లా దేవరపుల : దేవరుప్పుల మండలం సీతారాంపురం ప్రేమ సదన్ వృద్ధాశ్రమము లో 1978--79 విద్యా సంవత్సరంలో జడ్పీహెచ్ఎస్ దేవరుప్పుల పాఠశాలలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు తమ స్నేహబంధాన్ని సేవాభావంతో చాటుకుంటున్నారు. ఆనాడు 79 మంది విద్యార్థులు ఉండగా, వారిలో దాదాపు 60 మంది మిత్రులు ఒక గ్రూపుగా ఏర్పడి మూడేళ్ల క్రితం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు.ఆ సమ్మేళనం సందర్భంగా సమాజానికి తమ వంతుగా ఏదైనా సేవ చేయాలనే సంకల్పంతో ప్రేమ సదన్ సీతారాంపురం వృద్ధాశ్రమానికి బియ ం, దుస్తులు పంపిణీ చేశారు. అదే సేవా స్ఫూర్తిని కొనసాగిస్తూ, ప్రస్తుత చలికాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాజాగా వృద్ధాశ్రమంలోని వృద్ధులకు దుప్పట్లు, బెడ్‌షీట్లు, దిండ్లు, దిండు కవర్లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో శ్రీరంగం నరసయ్య, బుక్క లక్ష్మయ్య, తీగల లక్ష్మయ్య, ఈదునూరి రవీందర్ రెడ్డి, ఆకుల మల్లయ్య, కారుపోతున్న నరసయ్య, నరసింహాచారి తదితర మిత్రులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మిత్రులంతా మాట్లాడుతూ.. వృద్ధాశ్రమానికి భవిష్యత్తులో కూడా అవసరాలను బట్టి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. పాఠశాల నాటి స్నేహాన్ని పదిలంగా ఉంచుకుంటూ, సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్న పూర్వ విద్యార్థులను పలువురు అభినందించారు.

నర్సాపూర్ పురాతన గ్రంథాలయాన్ని సందర్శించిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపల్లి చంద్రం

- గ్రామంలో గ్రంథాలయ పునరుద్ధరణకు చర్యలు
- పుస్తకాలు అందించేందుకు చొరవ



సిద్దిపేట జిల్లా ప్రతినిధి,

సిద్దిపేట అర్బన్ మండలం నర్సాపూర్ లోని పురాతన గ్రంథాలయాన్ని సోమవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపల్లి చంద్రం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ చరిత్ర, గతంలో అందించిన సేవలు, ప్రస్తుతం దాని పరిస్థితి గురించి గ్రామస్తులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, వారికి అందుతున్న మధ్యాహ్న భోజన సదుపాయాలు, విద్యా వసతుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయ చైర్మన్ దరిపల్లి చంద్రం మాట్లాడుతూ నర్సాపూర్ గ్రామంలో గ్రంథాలయాన్ని తిరిగి అందుబాటులోకి తీసుకురావడానికి గ్రామస్తులు ముందుకు రావాలని కోరారు. గ్రామపంచాయతీకి సంబంధిం చిన భవనంలో లేదా పాఠశాల ఆవరణలో అనువైన భవనం ఏర్పాటు చేస్తే అవసరమైన పుస్తకాలను సమకూర్చేందుకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం గ్రంథాలయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తోందని పేర్కొన్నారు. ఈ విషయంపై గ్రామస్తులతో సానుకూలంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు మంద పాండు, నిజాముద్దీన్, వంగపల్లి అశోక్, యాదగిరి, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దక్షిణాఫ్రికా పర్యటనకు భారత మహిళల జట్టు ప్రకటన



మూడు ఫార్మాట్లకు సారథిగా స్మృతి మంధాన..

జట్టులో జెమీమా రోడ్రిగ్స్‌కు చోటు

న్యూఢిల్లీ, నవంబర్ 9:దక్షిణాఫ్రికా పర్యటనలో తలపడనున్న భారత మహిళల క్రికెట్ జట్లను బీసీసీఐ ప్రకటించింది. డిసెంబర్‌లో జరగనున్న ఈ పర్యటనలో టెస్టు, వన్డే, టీ20 మూడు ఫార్మాట్లకు స్మృతి మంధాన కెప్టెన్‌గా వ్యవహరించనుంది. ఈ పర్యటనలో భారత జట్టు ఒక టెస్టు, మూడు వన్డేలు, మూడు టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడనుంది.గతంలో టెస్టు క్రికెట్‌లో కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టని స్మృతి మంధానకు ఈ పర్యటనతో ఆ అవకాశం లభించింది. టెస్టు, వన్డే జట్లకు దీప్తి శర్మ వైస్ కెప్టెన్‌గా ఎంపికైంది. టీ20 జట్టుకు షఫాలీ వర్మ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనుంది.మోకాలి గాయం నుంచి కోలుకుని తిరిగి క్రికెట్‌లోకి వచ్చిన జెమీమా రోడ్రిగ్స్‌కు మూడు ఫార్మాట్ల జట్లలోనూ చోటు దక్కింది. గాయంతో కొంతకాలంగా జట్టుకు దూరమైన అమన్‌జోత్ కౌర్ టీ20 జట్టులోకి తిరిగి వచ్చింది. హర్మన్‌ప్రీత్ కౌర్, షఫాలీ వర్మ, రిచా ఘోష్, యాస్తికా భాటియా, హర్లీన్ డియోల్ తదితరులకు కూడా అవకాశం కల్పించారు.టెస్టు జట్టు: స్మృతి మంధాన (కెప్టెన్), షఫాలీ వర్మ, ప్రతీకా రావల్, హర్మన్‌ప్రీత్ కౌర్, జెమీమా రోడ్రిగ్స్, హర్లీన్ డియోల్, రిచా ఘోష్, యాస్తికా భాటియా, దీప్తి శర్మ, శ్రీ చరణి, స్నేహ్ రాణా, క్రాంతి గౌడ్, నందిని శర్మ, జింతిమణి కలిత, సయాలి సత్ఘరే.వన్డే జట్టు: స్మృతి మంధాన (కెప్టెన్), షఫాలీ వర్మ, ప్రతీకా రావల్, హర్మన్‌ప్రీత్ కౌర్, జెమీమా రోడ్రిగ్స్, హర్లీన్ డియోల్, రిచా ఘోష్, యాస్తికా భాటియా, దీప్తి శర్మ, శ్రీ చరణి, వైష్ణవి శర్మ, క్రాంతి గౌడ్, నందిని శర్మ, జింతిమణి కలిత, సయాలి సత్ఘరే.టీ20 జట్టు: స్మృతి మంధాన (కెప్టెన్), షఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, హర్మన్‌ప్రీత్ కౌర్, నికీ ప్రసాద్, రిచా ఘోష్, జి. కమలిని, అనుష్క శర్మ, దీప్తి శర్మ, శ్రీ చరణి, ప్రేమ రావత్, అమన్‌జోత్ కౌర్, క్రాంతి గౌడ్, నందిని శర్మ, రేణుకా సింగ్ ఠాకూర్, అరుంధతి రెడ్డి, సయాలి సత్ఘరే.పర్యటన షెడ్యూల్: డిసెంబర్ 9న గ్కెబెర్హాలో ఏకైక టెస్టు మ్యాచ్‌తో పర్యటన ప్రారంభమవుతుంది. డిసెంబర్ 16న పార్లలో తొలి వన్డే, 19న కేప్‌టౌన్‌లో రెండో వన్డే, 22న బ్లోమ్‌ఫోంటెయిన్‌లో మూడో వన్డే జరుగుతాయి. డిసెంబర్ 26న బెనోనిలో తొలి టీ20, 29, 30 తేదీల్లో పోచ్చెఫ్‌స్ట్రూమ్‌లో చివరి రెండు టీ20 మ్యాచ్‌లు నిర్వహిస్తారు.మూడు ఫార్మాట్లలోనూ సత్తా చాటేందుకు భారత మహిళల జట్టు సిద్ధమవుతోంది. ఈ పర్యటనలో స్మృతి మంధాన నాయకత్వం, జెమీమా పునరాగమ నం, యువ క్రీడాకారిణుల ప్రదర్శనపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

ముంబైకి అర్ష్‌దీప్.. పంజాబ్‌కు హార్దిక్!



ఐపీఎల్‌లో సంచలన ఆటగాళ్ల మార్పిడి..

ముంబైకి లాభమంటున్న అభినవ్ ముకుంద్

న్యూఢిల్లీ, నవంబర్ 9:ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందు ముంబై ఇండియన్స్, పంజాబ్ కింగ్స్ మధ్య కీలక ఆటగాళ్ల మార్పిడి చర్చనీయాంశంగా మారింది. స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా పంజాబ్ కింగ్స్‌కు వెళ్లనుండగా, భారత ఎడమచేతి వాటం పేసర్ అర్ష్‌దీప్ సింగ్ ముంబై ఇండియన్స్‌కు మారనున్నాడు. ఈ ఒప్పందంపై రెండు ఫ్రాంచైజీలు అంగీకారానికి వచ్చినట్లు సమాచారం. అయితే బీసీసీఐ అధికారిక ఆమోదం, ఇతర ప్రక్రియలు పూర్తయిన తర్వాతే ఈ మార్పిడి ఖరారు కానుంది.**ముంబైకే ఎక్కువ ప్రయోజనం!**మాజీ భారత క్రికెటర్ అభినవ్ ముకుంద్ ఈ ఆటగాళ్ల మార్పిడిపై స్పందిస్తూ ముంబై ఇండియన్స్‌కే ఎక్కువ ప్రయోజనం కలుగుతుందని అభిప్రాయపడ్డాడు. పంజాబ్ జట్టు అర్ష్‌దీప్, శ్రేయస్ అయ్యర్, యుజ్వేంద్ర చాహల్ వంటి కీలక ఆటగాళ్లపై పెట్టుబడి పెట్టిందని గుర్తుచేశాడు. ఇప్పుడు అర్ష్‌దీప్‌ను వదులుకుని హార్దిక్‌ను తీసుకోవడం జట్టు కూర్పుపై ప్రభావం చూపుతుందని పేర్కొన్నాడు.**శ్రేయస్ నాయకత్వంలో హార్దిక్ ఎలా?**పంజాబ్ కింగ్స్ కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్ కొనసాగనున్న నేపథ్యంలో ఆయన నాయకత్వంలో హార్దిక్ ఎలా ఆడతాడన్నది ఆసక్తికరంగా మారిందని ముకుంద్ ప్రశ్నించాడు. హార్దిక్ జట్టులో ఆల్‌రౌండర్‌గా మాత్రమే కొనసాగుతాడా? జట్టు సమతుల్యత ఎలా ఉంటుంది? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉందన్నాడు. హార్దిక్ రాకతో పంజాబ్ జట్టులో ఇప్పటికే ఉన్న మార్కస్ స్టోయినిస్ భవిష్యత్తుపైనా ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నాడు.**అర్ష్‌దీప్‌తో బుమ్రాకు జోడీ**అర్ష్‌దీప్ ముంబై ఇండియన్స్‌లో చేరితే జస్ప్రీత్ బుమ్రాతో కలిసి బలమైన పేస్ దళాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉంటుంది. పవర్‌ప్లేలో వికెట్లు తీయడంతో పాటు చివరి ఓవర్లలోనూ బౌలింగ్ చేయగల సామర్థ్యం అర్ష్‌దీప్‌కు ఉంది. మరోవైపు అర్ష్‌దీప్‌ను వదులుకోవడం పంజాబ్ బౌలింగ్ విభాగాన్ని బలహీనపరచవచ్చని మాజీ క్రికెటర్ ఆకాష్ చోప్రా అభిప్రాయపడ్డాడు.ఈ మార్పిడి జరిగితే పంజాబ్ జట్టులో యువ ఆల్‌రౌండర్ సూర్యాంశ్ షెడ్గేకు అవకాశాలు తగ్గుతాయా అన్న సందేహాన్ని కూడా అభినవ్ ముకుంద్ వ్యక్తం చేశాడు. మొత్తానికి ఐపీఎల్ వేలానికి ముందు ఈ ఆటగాళ్ల మార్పిడి రెండు జట్ల కూర్పులో ఎలాంటి మార్పులు తీసుకొస్తుందోనని క్రికెట్ అభిమానులు ఆసక్తిగా

భారత పేసర్ల ధాటికి కివీస్ బ్యాటర్లు విలవిల

యువ బౌలర్ల ప్రదర్శనపై న్యూజిలాండ్ బ్యాటింగ్ కోచ్ లూక్ రోంచి ప్రశంసలు

పరిస్థితులను చక్కగా ఉపయోగించుకుంటున్న భారత బౌలర్లు..

బ్యాటర్లకు సవాల్‌గా మారిన పేస్ దళం



హామిల్టన్, నవంబర్ 9:న్యూజిలాండ్ పర్యటనలో భారత యువ ఫాస్ట్ బౌలర్లు అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంటున్నారు. తమ పదునైన బంతులు, కచ్చితమైన లైన్, లెంగ్త్‌తో కివీస్ బ్యాటర్లను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. భారత పేసర్ల ప్రదర్శనపై న్యూజిలాండ్ బ్యాటింగ్ కోచ్ లూక్ రోంచి ప్రశంసలు కురిపించాడు. భారత బౌలర్లు తమ బ్యాటర్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వడం లేదని, బౌలింగ్‌కు అనుకూలిస్తున్న పరిస్థితులను అద్భుతంగా వినియోగించుకుంటున్నారని పేర్కొన్నాడు. అర్ష్‌దీప్ సింగ్, ఔకిబ్ నబీ, అన్షుల్ కాంబోజ్, గుర్నూర్ బ్రార్ వంటి యువ బౌలర్లు తమ ప్రతిభను నిరూపించుకుంటున్నారని తెలిపాడు. తొలి రెండు వన్డేల్లో న్యూజిలాండ్ కోల్పోయిన 20 వికెట్లలో 17 వికెట్లను భారత పేసర్లు పడగొట్టడం వారి ఆధిపత్యానికి నిదర్శనంగా నిలిచింది. ఆక్లాండ్, వెల్లింగ్టన్ వేదికలుగా జరిగిన మ్యాచ్‌ల్లో కివీస్ బ్యాటింగ్ విభాగం పూర్తిగా తడబడింది. తొలి మ్యాచ్‌లో 185 పరుగులకు, రెండో మ్యాచ్‌లో 134 పరుగులకే ఆలౌట్ కావడం భారత బౌలింగ్ బలాన్ని తెలియజేస్తోంది.**పిచ్‌లను సమర్థంగా వినియోగించుకుంటూ..**న్యూజిలాండ్ పరిస్థితుల్లో బంతి స్వింగ్, సీమ్ అవుతున్నప్పుడు భారత బౌలర్లు దానిని చక్కగా ఉపయోగించుకుంటున్నారని రోంచి వివరించాడు. ముఖ్యంగా తొలి ఓవర్లలోనే వికెట్లు తీస్తూ ప్రత్యర్థి జట్టుపై ఒత్తిడి పెంచుతున్నారని పేర్కొన్నాడు. బౌలర్లు క్రమశిక్షణతో బంతులు వేస్తూ బ్యాటర్లను తప్పులు చేసేలా చేస్తున్నారని తెలిపాడు. భారత పేసర్లు కేవలం వేగంపైనే ఆధారపడకుండా బంతి కదలికలను కూడా సమర్థంగా ఉపయోగించుకుంటున్నారని ప్రశంసించాడు.భారత జట్టులో యువ బౌలర్లకు లభిస్తున్న అవకాశాలు, వారు చూపుతున్న ప్రతిభ జట్టుకు భవిష్యత్తులో మరింత బలాన్ని అందించనున్నాయి. సీనియర్ బౌలర్లతో పాటు యువ పేసర్లు కూడా కీలక సమయాల్లో వికెట్లు తీస్తుండటం భారత జట్టు బౌలింగ్ విభాగానికి సానుకూల అంశంగా మారింది.**బ్యాటర్లు సంయమనంతో ఆడాలి**మరోవైపు తమ బ్యాటర్లు కూడా పరిస్థితులకు అనుగుణంగా ఆడాల్సిన అవసరం ఉందని రోంచి సూచించాడు. ప్రతి మ్యాచ్‌లో భారీ స్కోర్లు సాధించాలనే ఆలోచనతో బరిలోకి దిగడం సరైన విధానం కాదన్నాడు. పిచ్ పరిస్థితులను అర్థం చేసుకుని, ప్రత్యర్థి బౌలర్లకు అనుగుణంగా వ్యూహాలు మార్చుకోవాలని పేర్కొన్నాడు. బంతి స్వింగ్ అవుతున్నప్పుడు ఆచితూచి ఆడటం, క్రీజులో నిలదొక్కుకున్న తర్వాత పరుగుల వేగాన్ని పెంచడం ముఖ్యమని వివరించాడు.తొలి ఓవర్లలో వికెట్లు కోల్పోతే మిగతా బ్యాటర్లపై ఒత్తిడి పెరుగుతుందని, అందువల్ల ఆరంభంలో వికెట్లను కాపాడుకోవడంపై దృష్టి పెట్టాలని సూచించాడు. భారత బౌలర్లను ఎదుర్కొనేందుకు బ్యాటింగ్ విభాగం కొత్త వ్యూహాలతో సిద్ధం కావాల్సి ఉందని అభిప్రాయపడ్డాడు.

బాల్ ట్యాంపరింగ్ వివాదంలో కొత్త మలుపు!

- ఉస్మాన్ ఖవాజాకు డేవిడ్ వార్నర్ మద్దతు.. ఎనిమిదేళ్ల తర్వాత బయటపడుతున్న సంచలన విషయాలు



సిడ్నీ, నవంబర్ 9:ఆస్ట్రేలియా క్రికెట్‌ను కుదిపేసిన బాల్ ట్యాంపరింగ్ వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. 2018లో దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టు మ్యాచ్‌లో చోటుచేసుకున్న శాండ్‌పేపర్ వివాదంపై మాజీ ఆస్ట్రేలియా ఓపెనర్ ఉస్మాన్ ఖవాజా చేసిన వ్యాఖ్యలకు మరో మాజీ ఆటగాడు డేవిడ్ వార్నర్ మద్దతు ప్రకటించాడు. ఖవాజా వెల్లడించిన విషయాలు నూటికి నూరు శాతం నిజమని స్పష్టం చేశాడు. ఈ ఘటనపై క్రికెట్ ఆస్ట్రేలియా నిర్వహించిన విచారణ హడావుడిగా, లోపభూయిష్టంగా జరిగిందని విమర్శించాడు.**అసలు ఏం జరిగింది?**2018లో దక్షిణాఫ్రికాలోని కేప్‌టౌన్ వేదికగా జరిగిన మూడో టెస్టులో ఆస్ట్రేలియా ఆటగాడు కామెరాన్ బాన్‌క్రాఫ్ట్ శాండ్‌పేపర్‌తో బంతి స్వరూపాన్ని మార్చేందుకు ప్రయత్నిస్తూ కెమెరాలకు చిక్కాడు. ఈ ఘటన అప్పట్లో ప్రపంచ క్రికెట్‌లో తీవ్ర సంచలనం సృష్టించింది. విచారణ అనంతరం డేవిడ్ వార్నర్, స్టీవ్ స్మిత్, కామెరాన్ బాన్‌క్రాఫ్ట్‌లపై క్రికెట్ ఆస్ట్రేలియా కఠిన చర్యలు తీసుకుంది. వార్నర్, స్మిత్‌లకు ఏడాది పాటు నిషేధం విధించగా, బాన్‌క్రాఫ్ట్‌పై తొమ్మిది నెలల నిషేధం విధించారు. వార్నర్‌పై నాయకత్వ బాధ్యతలు చేపట్టకుండా శాశ్వత నిషేధం కూడా విధించారు. అనంతరం 2024లో ఆయనపై ఆ నాయకత్వ నిషేధాన్ని తొలగించారు.**జట్టంతటికీ తెలుసు: ఖవాజా**తాజాగా తన ఆత్మకథ 'సబ్'లోని కొన్ని విషయాలను వెల్లడించిన ఉస్మాన్ ఖవాజా ఈ వివాదంపై సంచలన వ్యాఖ్యలు చేశాడు. బంతి ఆకారాన్ని మార్చే ప్రయత్నం గురించి జట్టులోని బ్యాటర్లు, బౌలర్లు, సహాయక సిబ్బంది సహా అందరికీ తెలుసునని పేర్కొన్నాడు. ఇది కేవలం ముగ్గురు ఆటగాళ్లకు సంబంధించిన వ్యవహారం కాదని, జట్టులోని పలువురికి ఈ విషయం తెలిసి ఉందని వెల్లడించాడు. ఈ ఘటనపై అప్పట్లో జరిగిన విచారణలో తనను ప్రశ్నించలేదని కూడా ఆరోపించాడు.తాను కామెరాన్ బాన్‌క్రాఫ్ట్ పక్కనే ఉన్నప్పటికీ విచారణలో తన వాంగ్మూలాన్ని తీసుకోకపోవడం ఆశ్చర్యం కలిగించిందని ఖవాజా పేర్కొన్నాడు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వాస్తవాలు బయటకు రావాలని, ముగ్గురు ఆటగాళ్లపైనే మొత్తం బాధ్యతను మోపడం సరైనది కాదని అభిప్రాయపడ్డాడు.**వార్నర్ ఏమన్నాడంటే..**ఖవాజా వ్యాఖ్యలపై స్పందించిన డేవిడ్ వార్నర్ సామాజిక మాధ్యమాల్లో వీడియో విడుదల చేశాడు. తన చిన్ననాటి స్నేహితుడైన ఖవాజాకు పూర్తి మద్దతు ప్రకటించాడు. ఆయన వెల్లడించిన విషయాలు పూర్తిగా నిజమని పేర్కొన్నాడు. ఎనిమిదేళ్లుగా ఈ అంశంపై తాను బహిరంగంగా మాట్లాడలేదని, ఇప్పుడు నిజాలు బయటకు రావాల్సిన సమయం వచ్చిందని తెలిపాడు.ఖవాజా విచారణలో భాగంగా వాంగ్మూలం ఇవ్వకపోవడాన్ని వార్నర్ ప్రశ్నించాడు. అసలు ఆయనను విచారించకుండా జరిగిన ప్రక్రియను సమగ్ర విచారణగా ఎలా పరిగణిస్తారని నిలదీశాడు. అప్పట్లో జరిగిన విచారణ తొందరపాటుతో, సరైన పద్ధతిలో సాగలేదని విమర్శించాడు. ఈ వ్యవహారంలో ఎవరినీ నిందించడం తమ ఉద్దేశం కాదని, వాస్తవాలు వెలుగులోకి రావడం, పారదర్శకత, బాధ్యతాయుతమైన విచారణ జరగడమే ముఖ్యమని పేర్కొన్నాడు.**క్రికెట్ ఆస్ట్రేలియా సమాధానం**మరోవైపు క్రికెట్ ఆస్ట్రేలియా మాత్రం గతంలో నిర్వహించిన విచారణపై తన వైఖరిని సమర్థించుకుంది. అప్పట్లో అందుబాటులోకి వచ్చిన సంబంధిత సమాచారాన్ని పరిశీలించిన తర్వాతే నిర్ణయాలు తీసుకున్నామని తెలిపింది. తమ విచారణలో వెల్లడైన అంశాలపై ఇప్పటికీ విశ్వాసం ఉందని స్పష్టం చేసింది. కొత్తగా ఏవైనా సంబంధిత ఆధారాలు అందిస్తే వాటిని పరిశీలించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొంది.అప్పటి ఆస్ట్రేలియా కోచ్ డారెన్ లెమన్ కూడా ఖవాజా వ్యాఖ్యలతో విభేదించాడు. జట్టులోని ప్రతి ఒక్కరికీ ఈ వ్యవహారం గురించి తెలుసని తాను భావించడం లేదని పేర్కొన్నాడు. మరోవైపు అప్పటి ఆస్ట్రేలియా బౌలర్లు పాట్ కమిన్స్, జోష్ హేజిల్‌వుడ్, మిచెల్ స్టార్క్, నాథన్ లయన్ 2021లో విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో ఈ ప్రణాళిక గురించి తమకు తెలియదని స్పష్టం చేశారు.

కోహ్లీ ఔటవడంతో గిల్‌కు తప్పిన చిక్కు!

- గావస్కర్ ఆసక్తికర వ్యాఖ్యలు



స్పోర్ట్స్ డెస్క్: న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో విరాట్ కోహ్లీ 51 బంతుల్లో 74 పరుగులు చేసి ఔటైన విషయం తెలిసిందే. దీనిపై భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కోహ్లీ సెంచరీకి చేరువలో ఉండి ఉంటే కెప్టెన్ శుభ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్ ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కొనేవారని అభిప్రాయపడ్డారు.కోహ్లీ 90లలో ఉండి ఉంటే జట్టు విజయానికి వేగంగా పరుగులు చేయాలా? లేక అతడికి సెంచరీ అవకాశం కల్పించాలా? అనే సందిగ్ధం ఇద్దరికీ ఎదురయ్యేదని గావస్కర్ పేర్కొన్నారు. వేగంగా ఆడి మ్యాచ్ ముగిస్తే అభిమానుల నుంచి విమర్శలు వచ్చే అవకాశం ఉండేదన్నారు. కోహ్లీ ఔటవడంతో గిల్, అయ్యర్‌కు ఆ ఇబ్బంది తప్పిందని తెలిపారు. కోహ్లీ 100 అంతర్జాతీయ సెంచరీలు సాధించాలని ప్రతి భారత అభిమాని కోరుకుంటున్నారని, సహచరుల సహకా రంతో ఆ ఘనత సాధిస్తే అభిమానుల అందరికీ ఆనందమే నని గావస్కర్ పేర్కొన్నారు. అయితే వ్యక్తిగత రికార్డు జట్టు విజయావకాశాలను

వెట్టువమ్ 'సెలబ్రేట్ రెసిలియెన్స్'..
ఇంటెన్స్ లుక్‌లో శోభిత



రెండు భిన్నమైన వర్గాల మధ్య జరిగే ఆధిపత్య పోరును సహజంగా తెరకెక్కించడంలో దర్శకుడు పా. రంజిత్ రూటే వేరు. ఆయన నుంచి వస్తున్న లేటెస్ట్ భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ వెట్టువమ్. ఆర్య, దినేష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమా నుంచి సెలబ్రేట్ రెసిలియెన్స్ పేరుతో మేకర్స్ ఓ మేకింగ్ వీడియోను విడుదల చేశారు. చిన్న గ్లింప్స్‌తోనే సినిమా ఏ రేంజ్‌లో ఉండబోతోందో క్లియర్ కట్ హింట్ ఇచ్చారు. ఈ వీడియోలో చూపించిన మేకింగ్ షాట్స్ ప్రాజెక్ట్ చూస్తుంటే గ్రాండ్ స్కేల్‌లోనే ప్లాన్ చేస్తున్నట్లు అర్థమవుతుంది. ఒక పెద్ద విలేజ్ సెట్ నడుమ వందలాది మందితో ప్లాన్ చేసిన భారీ కొట్లాటలు, గాల్లోకి లేచే కార్లు, బ్లాస్టింగ్‌లు చూస్తుంటే ఫుల్ యాక్షన్ డ్రామా రెడీ అవుతున్నట్లు తెలుస్తోంది. పా. రంజిత్ స్వయంగా మైక్ పట్టుకుని సీన్లను లీడ్ చేయడం, దిలీప్ సుబ్బరాయన్ కంపోజ్ చేసిన రియలిస్టిక్ స్టంట్స్ విజువల్స్ లో మంచి ఇంటెన్సిటీ తీసుకొచ్చాయి. వీడియోలో హీరోల లుక్స్ ప్రాజెక్ట్‌పై ఆసక్తిని పెంచుతున్నాయి. గోధుమ రంగు షర్ట్, గాగుల్స్‌తో మాస్ లీడర్‌లా నడిచివచ్చే ఆర్య, మరో సీన్‌లో తెల్లటి దుస్తుల్లో చేతిలో గన్ పట్టుకుని నిలబడే ఫ్రేమ్స్ అదిరిపోయాయి. మరోవైపు గడ్డంతో ఫుల్ రగ్గడ్ అవతారంలో కనిపించిన దినేష్ ఎనర్జీ కూడా చాలా రాగా ఉంది. వీరిద్దరి పాత్రల మధ్య నడిచే క్లాష్ తెరపై అసలైన థ్రిల్ ఇచ్చేలా కనిపిస్తోంది. ఈ గ్లింప్స్‌లో ప్రత్యేకంగా ఆకట్టుకున్న అంశం శోభితా ధూళిపాళ్ల ప్రెజెన్స్. సాధారణంగా గ్లామరస్ పాత్రల్లో కనిపించే శోభిత, ఇందులో పూర్తి డీగ్లామరైజ్డ్ రగ్గడ్ రోల్‌లో కనిపించి అందరినీ సర్ ప్రైజ్ చేసింది. ఆమె వేసిన మార్షల్ ఆర్ట్స్ ఫైటింగ్ పోజ్, కళ్లలో చూపించిన ఇంటెన్సిటీ చాలా పవర్‌ఫుల్‌గా ఉంది. కథానాయికగానే పరిమితం కాకుండా, ఒక బలమైన పోరాట యోధురాలి తరహా పాత్రను ఎంచుకుని శోభిత తన నటనలోని కొత్త కోణాన్ని చూపిస్తోందనే నమ్మకం కలుగుతోంది.



పూర్ ఫ్యామిలీకి హఠాత్తుగా డబ్బు సంచులు దొరికితే ..
ఓటీటీలో 'ఆల్ పాస్' మూవీ!

కొన్ని కథలు వాస్తవ పరిస్థితులను ప్రతిబింబిస్తూనే వినోదాన్ని పంచుతుంటాయి. సహజత్వానికి దగ్గరగా మానవ స్వభావాలను ఆవిష్కరిస్తూనే ఆలోచింపజేస్తాయి. చాలా కుటుంబాలను దగ్గరగా పరిశీలన చేస్తే ఒక విషయం అర్థమవుతుంది. పేదరిమలో ఉన్నప్పుడు వాళ్లంతా చాలా ప్రేమతో ఉంటారు. అనుకోకుండా వాళ్ల మధ్యకి డబ్బు వచ్చిపడినప్పుడు ఆ ప్రేమ కలుషితం అవుతూ ఉంటుంది. ఇందుకు అతీతంగా వ్యవహరించేవారు సంఖ్య చాలా అరుదనే చెప్పాలి. అలాంటి ఒక కథతో రూపొందిన సినిమానే 'ఆల్ పాస్'. తమిళంలో మోహన్ రంగనాథన్ నిర్మించిన ఈ సినిమాకి మైదీన్ దర్శకత్వం వహించాడు. అక్టోబర్ 9వ తేదీన థియేటర్లలో విడుదలైన సినిమా ఇది. దుష్యంత్ జయప్రకాశ్ .. సెంథిల్ కుమారి.. సుబ్రహ్మణ్యం శివ .. జనని కునశీలన్ .. వినోదిని వైద్యనాథన్ ముఖ్యమైన పాత్రలను పోషించారు. జేమ్స్ వసంతన్ సంగీతాన్ని సమకూర్చిన ఈ సినిమా ఇప్పుడు ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ నెల 6వ తేదీ నుంచి అందుబాటులోకి వచ్చింది. ఈ కథ చెన్నైలోని ఒక బస్తీలో జరుగుతుంది. ఈ బస్తీలో మూడు కుటుంబాల వారు చాలా కాలంగా నివసిస్తూ ఉంటారు. ఈ పేదరికాన్ని తట్టుకుని నిలబడాలంటే, తామంతా ఉమ్మడి కుటుంబంగా ఉండటమే మార్గమని భావిస్తారు. అంతా కలిసి ఒకే ఇంట్లో ఎంతో ప్రేమగా నివసిస్తూ ఉంటారు. అదే సమయంలో ఊహించని విధంగా వాళ్ల మధ్యలోకి పెద్ద మొత్తంలో డబ్బు వచ్చిపడుతుంది. అప్పటి నుంచి వాళ్లలో ఎలాంటి మార్పు వస్తుంది? వాళ్లతో ఏమేం చేయిస్తుంది? చివరికి వాళ్లు గ్రహించే నిజం ఏమిటి? అనేది కథ.

అనిరుధ్-కావ్యల పెళ్లి సందడి..
గ్రీస్‌కు బయల్దేరిన తలైవా, మాజీ సీఎం స్టాలిన్



ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్, సన్‌రైజర్స్ హైదరాబాద్ సీఈవో కావ్య మారన్ వివాహ బంధంతో ఒకటవ్వబోతున్నారు. వీరి వివాహ వేడుక గ్రీస్‌లో డెస్టినేషన్ వెడ్డింగ్‌గా నవంబర్ 10, 11 తేదీల్లో అత్యంత సన్నిహితుల మధ్య జరగనుంది. ఈ వేడుకకు హాజరయ్యేందుకు సూపర్ స్టార్ రజనీకాంత్, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఈ రోజు ఉదయం విమానాశ్రయం నుంచి గ్రీస్‌కు బయల్దేరి వెళ్లారు. దీంతో ఈ హై-ప్రొఫైల్ వివాహంపై అందరి దృష్టి నెలకొంది.
కావ్య మారన్, ప్రఖ్యాత సన్ గ్రూప్ చైర్మన్ కళానిధి మారన్ కుమార్తె. ఆమె ప్రస్తుతం ఐపీఎల్ ఫ్రాంచైజీ సన్‌రైజర్స్ హైదరాబాద్ సీఈవోగా, సన్ టీవీ నెట్‌వర్క్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. మరోవైపు అనిరుధ్ రవిచందర్ ప్రస్తుతం దక్షిణాది సినిమా పరిశ్రమలో అగ్ర సంగీత దర్శకుడిగా కొనసాగుతున్నారు. ఎంతోకాలంగా వీరిద్దరి వివాహంపై చర్చలు జరుగుతుండగా, ఇప్పుడు అధికారికంగా పెళ్లి వేడుకలు మొదలయ్యాయి.గ్రీస్‌లో జరిగే ఈ వివాహ వేడుకకు కేవలం ఇరు కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే హాజరు కానున్నారు. ఇది పూర్తిగా ప్రైవేట్ కార్యక్రమంగా జరగనుంది. అనంతరం నవంబర్ 21న చెన్నైలో సినీ, రాజకీయ, క్రీడా, వ్యాపార రంగాలకు చెందిన ప్రముఖుల కోసం భారీ ఎత్తున రిసెప్షన్ ఏర్పాటు చేశారు. ఈ రిసెప్షన్‌కు సంబంధించిన ఆహ్వాన పత్రికను కావ్య తల్లిదండ్రులు ఇటీవల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అందజేయడంతో వేడుక తేదీ ఖరారైంది.చెన్నై రిసెప్షన్‌కు పలువురు అగ్రశ్రేణి ప్రముఖులు హాజరుకానున్నట్లు సమాచారం. అయితే, ఈ వివాహ ఏర్పాట్లపై అనిరుధ్, కావ్యల కుటుంబాల నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. సోషల్ మీడియాలో మాత్రం వీరి వివాహానికి సంబంధించిన వార్తలు, ప్రముఖుల ప్రయాణ దృశ్యాలు వైరల్ అవుతున్నాయి.

ఫెస్టివ్ వైబ్.. ఎలిగెంట్ లుక్ లో మృణాల్ సోయగాలు..



ఫెస్టివల్స్ మొదలయ్యాయి అంటే చాలు సెలబ్రిటీలు అందంగా, సాంప్రదాయంగా ముస్తాబవుతూ అభిమానులకు కన్నుల విందుగా కనిపిస్తూ ఉంటారు. ఈ క్రమంలోనే దంతేరాస్ సందర్భంగా తెలుగు ప్రేక్షకులను సీతామహాలక్ష్మి పాత్రతో కట్టిపడేసిన మృణాల్ ఠాకూర్ తన అధికారిక ఇంస్టాగ్రామ్ వేదికగా పంచుకున్న ఫోటోలు సోషల్ మీడియాలో ప్రత్యేక వైరల్ గా మారుతున్నాయి. చీరకట్టులో కనిపించి తన ఎలిగెంట్ లుక్కుతో అభిమానులను మెస్మరైజ్ చేసింది. ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ సీమ గుజ్రాల్ కలెక్షన్స్ నుండి ఎంపిక చేసిన ఐవరీ కలర్ డిజైనర్ సారీ కట్టుకొని , తన లుక్ తో అభిమానులను ఆకట్టుకుంది. ఈ జార్జెట్ చీర పై క్లిష్టమైన పైస్లీ ఎంబ్రాయిడరీ డిజైన్ తో రూపొందించారు. మొత్తం అద్దాల పనితనం , పూసల అమరిక చాలా ఆకర్షణీయంగా కనిపిస్తోంది. దీనికి మ్యాచింగ్ గా స్ట్రాపీ హ్టెల్ లో నెక్ లైన్ కలిగిన హెవీ మిర్రర్ వర్క్ బ్లౌజ్ జత చేసింది. ఈ ఔట్ ఫిట్ లో మృణాల్ తన లుక్ ను మరింత రాయల్ గా మార్చడానికి మెడలో మ్యాచింగ్ హెవీ చౌకర్ నెక్లెస్ ధరించి పెద్ద చెవిపోగులతో తన అందాన్ని రెట్టింపు చేసుకుంది. మొత్తానికైతే దంతేరాస్ స్పెషల్ సందర్భంగా తన లేటెస్ట్ అవుట్ ఫిట్ తో ఎలిగెంట్గా కనిపించి అభిమానుల హృదయాలను దోచుకుంది .అంతేకాదు మిర్రర్ వర్క్ తో డిజైన్ చేసిన శారీలో దీపావళి మొత్తం మీలోనే కనిపిస్తోంది అంటూ నెటిజన్స్ కామెంట్లు చేస్తున్నారు.2012లో ముజ్ సే కుచ్ కెహెతి.. ఏ ఖామోషియాన్ అనే హిందీ సీరియల్ ద్వారా నటన రంగంలోకి అడుగుపెట్టిన ఈమె.. 2014లో విట్టిదండు అనే మరాఠీ చిత్రం ద్వారా నటిగా వెండితెరకు పరిచయమైంది. ఆ తర్వాత హిందీ, తెలుగు చిత్రాలలో నటిస్తూ ప్రేక్షకులను అలరిస్తోంది. తెలుగు సినిమా విషయానికొస్తే 2022లో హను రాఘవపూడి దర్శకత్వంలో మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ నేరుగా తెలుగులో చేసిన చిత్రం సీతారామం. ఈ చిత్రం ద్వారా వెండితెరకు సీతామహాలక్ష్మి పాత్రతో పరిచయమై అందరి దృష్టిని ఆకట్టుకుంది. ఈ సినిమాతో ఏకంగా భారీ బ్లాక్ బాస్టర్ విజయం అందుకోవడంతో వరుసగా అవకాశాలు తలుపు తట్టాయి.ఆ తర్వాత హాయ్ నాన్న, ఫ్యామిలీ స్టార్ వంటి చిత్రాలలో నటించినా.. ఈమె సరైన సక్సెస్ అందుకోలేదు. ఆ తర్వాత డెకాయిట్ చిత్రంలో నటించి మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. రీసెంట్ గా పూజ మేరీ జాన్ అనే ఓటిటీ చిత్రంతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇక ప్రస్తుతం రాకాసినిమాలో నటిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. కానీ దీనిపై అఫీషియల్ అనౌన్స్మెంట్ ఇంకా వెలువడలేదు. ఏది ఏమైనా మృణాల్ ఠాకూర్ ఇప్పుడు భాషతో సంబంధం లేకుండా వరుస భాషా చిత్రాలలో నటిస్తూ తన స్టార్ స్టేటస్ ను మరింత పెంచుకునే ప్రయత్నం చేస్తుంది ఈ ముద్దుగుమ్మ.

దీపావళి రోజున కుమ్మేసిన 'రామాయణ'



బాలీవుడ్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, భారీ బడ్జెట్ తో తెరకెక్కిన పౌరాణిక చిత్రం 'రామాయణ' బాక్సాఫీస్ వద్ద రికార్డుల వేట కొనసాగిస్తోంది. విడుదలైన నాలుగు రోజుల్లోనే ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ.500 కోట్ల మార్కుకు చేరువై విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ముఖ్యంగా దీపావళి పర్వదినం రోజున ప్రేక్షకుల నుంచి అనూహ్య స్పందన లభించడంతో భారీ వసూళ్లు నమోదయ్యాయి.
దీపావళి, ఆదివారం రెండూ కలిసి రావడంతో సినిమా విడుదలైన నాలుగో రోజున ఒక్కరోజే దేశీయంగా రూ.56.15 కోట్ల నెట్ వసూళ్లను ఈ చిత్రం రాబట్టింది. దీంతో 2023లో సల్మాన్ ఖాన్ చిత్రం 'టైగర్ 3' దీపావళి నాడు సాధించిన రూ.44.50 కోట్ల రికార్డును 'రామాయణ' అధిగమించింది. ఇప్పటివరకు దీపావళి పండుగ రోజున బాలీవుడ్‌లో అత్యధిక కలెక్షన్లు సాధించిన చిత్రాల జాబితాలో అగ్రస్థానాన్ని దక్కించుకుంది.ఈ సినిమా భారత్‌లో తొలి రోజు రూ.64.85 కోట్లు, రెండో రోజు రూ.48.05 కోట్లు, మూడో రోజు రూ.69.80 కోట్లు, నాలుగో రోజు రూ.56.15 కోట్ల నెట్ రాబట్టింది. దీంతో దేశవ్యాప్తంగా మొత్తం నెట్ కలెక్షన్లు రూ.238.85 కోట్లకు చేరగా, గ్రాస్ వసూళ్లు రూ.285.20 కోట్లుగా నమోదయ్యాయి. గతంలో ప్రభాస్ నటించిన 'ఆదిపురుష్' తొలి నాలుగు రోజుల్లో సాధించిన రూ.237 కోట్ల నెట్ మార్కును కూడా 'రామాయణ' దాటేసింది. ఇక ఓవర్సీస్‌లో రూ.214 కోట్ల గ్రాస్ రావడంతో, ప్రపంచవ్యాప్తంగా మొత్తం వసూళ్లు రూ.499.20 కోట్లకు చేరుకున్నాయి. దీంతో అతి తక్కువ సమయంలోనే రూ.500 కోట్ల మైలురాయిని అందుకోవడానికి ఈ చిత్రం సిద్ధమైంది.

Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,
Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com